# మాధవశతకము



రచయిత్రి
వేమూరి (దాసు) శారదాంబ





శారదాంబ గారి తల్లిదండ్రులు

మహాకవి దాసు శ్రీరాములు
(ఏప్రిల్ 8, 1846-మే, 16,1908)

శ్రీమతి దాసు జానకమ్మ
(1853-1927)



శ్రీ వేమూరి రామచంద్రరావు
(1873-1927)



శ్రీమతి వేమూరి శారదాంబ
(మే 3, 1881-డిసెంబర్ 26, 1899)

శ్రీరస్తు

# మాధవశతకము

(స్త్రీజనక్షేమార్థక భగవత్ప్రార్థన పద్యములు)





రచయిత్రి

**శ్రీమతి వేమూరి(దాసు)శారదాంబ**

**Madhavasatakamu**
by
**Smt.Vemuri(Dasu)Saradamba**

**మాధవశతకము**

**శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ**

ప్రథమ ముద్రణ : 1901

ద్వితీయ ముద్రణ : 2019

**© మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి**

ప్రతులు : 500

వెల : **రూ. 100/-**

**ప్రతులకు :**

**డా|| దాసు అచ్యుతరావు**
ఫ్లాట్ నెం. 201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,
ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-23734864, 9490023947
email : araodasu@gmail.com

**మరియు**
**అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు**

ముఖ చిత్రం :
**కె.వి. భీమారావు, సెల్ : 9848444841**

డి.టి.పి.
**సమంత గ్రాఫిక్స్**
ఎస్.ఆర్.టి. 208,
జవహర్ నగర్, హైదరాబాద్ - 80.
ఫోన్ : 9440631462

ముద్రణ
**శ్రీ అష్పో ప్రింటర్స్**
1-8-540/1, చిక్కడపల్లి,
హైదరాబాద్ - 500 020.
ఫోన్ : 040-66668310

# నివేదన

శ్రీమతి వేమూరి శారదాంబ, ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, మచిలీపట్నం దగ్గరనున్న ఈనాటి ముదినేపల్లి మండలంలోని అల్లూరు గ్రామంలో శ్రీ దాసు శ్రీరాములు. జానకమ్మ దంపతులకు మే 3,1881 న జన్మించారు. ఆరుగురు పుత్రుల తరువాత కలిగిన పుత్రిక అయినందున శారదాంబ తలిదండ్రులు, ఆరుగురు అన్నల మధ్య గారాబంగా పెరిగింది. శ్రీరాములు గారు తన పితామహి శేషమ్మ గారిపై ప్రేమతో శారదాంబను 'శేషమాంబ' అనికూడా పిలుచుకునేవారు. శారదాంబ బాల్యం నుండే సంగీత, సాహిత్య పిపాసి. ఏకసంథాగ్రాహి. ఆరేళ్ళ చిన్న వయస్సులో పాటలను ఒకసారి వినగానే అత్యంత శ్రావ్యంగా అదేబాణీలో పాడేవారు.

అది స్త్రీలపట్ల దుర్భరమైన, దుర్మార్గమైన వివక్ష చూపిస్తున్న కాలం. స్త్రీలు విద్యావికాసానికి, అభ్యుదయానికి అనర్హులు, గృహనిర్వహణ బాధ్యతలతో, పెద్దల అదుపాజ్ఞలలో కట్టుబానిసలుగా ఉండవలసినవారే, సంగీతం, నాట్యం వంటి కళలు నేర్చుకునే స్రీలు వేశ్యలే, అని భావించే సాంఘిక వాతావరణం. 19 వ శతాబ్దం ఉత్తరార్థంలో ఆంధ్ర దేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన శ్రీరాములు గారు (1846–1908) స్త్రీలు సంగీత, సాహిత్యములు నేర్చుకొనటానికి ఎటువంటి అభ్యంతరము ఉండకూడదని దృఢంగా నమ్మినవారు. సమాజ అభ్యుదయానికి, వికాసానికి స్త్రీలు విద్యావంతులై స్వశక్తి సాధించటము అత్యంత అవసరమని ప్రచారం చేసిన సంస్కరణాభిలాషి. ప్రచారంతో సరిపెట్టుకోకుండా స్వయంగా ఆచరించి చూపెట్టారు. సంగీత, సాహిత్యాలలో శారదాంబ ఆసక్తి గుర్తించి చిన్న వయసులోనే ఆమెకు తెలుగు, సంస్కృతాలు నేర్పారు. సంగీత విద్య నేర్చుకోవటాన్ని ప్రోత్సహించారు. లోకనిందను ఎంతమాత్రము లక్ష్యము చేయలేదు. మంచి వైణికురాలుగా తీర్చి ద్దారు. పిన్న వయసులోనే శారదాంబ మైసూరువంటి నగరాలలో కచేరీలు కూడా చేసారు.

శారదాంబకు 1888 మే లో వేమూరి రామన్న, నాగమ్మ గార్ల రెండవ కుమారుడు వేమూరి రామచంద్ర రావు తో వివాహం జరిగింది. అప్పటి సాంఘిక పరిస్థితులలో, మెట్టినింట తన ఆశయాలకు, ఆకాంక్షలకు, అభ్యుదయభావాలకు తగిన ఆదరణ లభించకపోయినా, నిరుత్సాహానికి లోనుకాకుండా సాహితీ కృషి

సాగిస్తూ పద్నాల్గవ యేటనే పద్యాలు రాయటం ప్రారంభించారు. విద్యావంతురాలైన శారదాంబ, ఆనాటి స్త్రీలు అనుభవిస్తున్న వివక్ష, ముఖ్యంగా వారికి చదువు నేర్పించక పోవటం, బయటకురానీయకుండా ఇంటికే పరిమితంచేయటం వంటి దురాచారాలపై విమర్శనాత్మక కవితలు, వ్యాసాలు, రచించారు. ఆనాటి 'జనాన పత్రిక' మరియు 'జ్ఞానోదయ పత్రిక' వంటి ప్రముఖ పత్రికలలో ఆ రచనలు ప్రచురింపబడ్డాయి. స్త్రీలకు ఈ దుస్థితినుంచి విముక్తి కలిగించమని దైవాన్ని వేడుకుంటూ శారదాంబ 'మాధవ శతకము' లో 'స్త్రీ జనక్షేమార్ధక భగవత్ప్రార్ధన పద్యములు' రచించారు. పదహారేళ్ళ వయస్సులో 'నాగ్నజితీ పరిణయము' అను ప్రబంధ రచనతో రచయిత్రిగా, కవయిత్రిగా గుర్తింపు వచ్చింది. ఈ కావ్యంలో ప్రబంధ లక్షణములున్నవని, దీనిలో మహాకవయిత్రి మొల్ల కవితాశైలి ప్రస్ఫుటముగా కనపడుతుందని ఆనాటి పండితుల ఆమె రచనాపటిమను కొనియాడారు.

అభ్యుదయవాది, స్త్రీవిద్యాహితైషి శ్రీమతి వేమూరి శారదాంబకు ఒక కుమార్తె దుర్గాంబ, ఒక కుమారుడు, పార్ధసారధి సంతానము. దురదృష్టవశాన కుమారుని ప్రసవ సమయంలో డిసెంబర్ 26, 1899 న, శారదాంబ ఏలూరులో పరమ పదించారు. అప్పటికి ఆమె వయస్సు 19 సంవత్సరములు మాత్రమే. అద్భుత మేధాసంపత్తులతో అభ్యుదయ కవయిత్రిగా ఖ్యాతిగాంచిన శ్రీమతి వేమూరి శారదాంబ, ధన్యజీవి, ప్రగతిశీలి, ఆదర్శ మార్గదర్శి.

కవితా సాధనలో ఎంతో భవిష్యత్తు ఉన్న తన ముద్దులపుత్రిక ఆకస్మిక మరణాన్ని శ్రీరాములు గారు ధైర్యంతో భరించారు. కూతురు శారదాంబను సంస్మరిస్తూ ఆమె వైదుష్యాన్ని, వైశారద్య ప్రస్థాన ప్రగతిని ఈ పద్యరూపంలో 'శ్రీ దేవీభాగవతము' లో పొందుపరిచారు.

**సీ. తనతొమ్మిదవయేట ననుపమానప్రజ్ఞ నింపుగా వీణ వాయింప నేర్చె**
**తన పదియవయేట సునిశితంబగు బుద్ధి దాగొల్పె నేకసంతగ్రహణము**
**తన చతుర్దశ శరత్తున ముద్దుముద్దుగా నల్లిబిల్లిగ బద్యమల్లనేర్చె**
**తనదు పదార్వ వత్సరమున నగ్నజిజ్జా వివాహప్రబంధంబు సెప్పె**

**తే.గీ. తనదు పందొమ్మిదవవర్షముననె మర్త్య భావమునుమాని శాశ్వత బ్రహ్మలోక**
**సిద్ధిఁ గనె శారదాంబ నాచిన్నికూతు ననుదినంబును మఱువక యాత్మనుంత.**

ఈ విషయాలన్నీ ఆరు, ఏడు దశాబ్దాల పూర్వపు తరంవారిలో చాలామందికి తెలిసియుండవచ్చును. ఆమె రచనలను పునర్ముద్రించి ఈ తరంవారికి పరిచయం చేయాలనే ప్రయత్నంలో ప్రథమంగా, 2014 నవంబరు మొదటి వారంలో ఒక వ్యాసం వ్రాయడానికి ఉపక్రమించాను. ఆమె రాసిన కొన్ని పద్యాలనైనా అందులో ఉటంకించాలనుకున్నాను. కాని 1900 ల ప్రాంతంలో ముద్రించబడ్డ ఆపుస్తకాలు నాకు లభ్యంకాలేదు. సంకల్పం ఉన్నతమైనదైతే దైవసహాయం దానంతటదే వస్తుందని నా ధృఢవిశ్వాసం. 22-11-2014 మధ్యాహ్నం గుంటూరు నుంచి శారదాంబ గారి 'నాగ్నజితీ పరిణయము' ఉంటే కావాలి అని ఒక మహానుభావుడు 'మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి' కి వ్రాసిన పోస్ట్ కార్డ్ వచ్చింది. అందులో ఇంకా "ఆమె రచన 'మాధవ శతకము' మీదగ్గర ఉండవచ్చు, లేకపోతే నాదగ్గర ఉంది నేను పంపిస్తాను" అని ఉంది. నా ఆనందానికి అవధులు లేవు. దివినుంచి కైవ్రాలిన దివ్యప్రసాదం *(Manna)* గా భావించా. వెంటనే ఆయనకు ఫోన్ చేస్తే ఎంతో సంతోషించి 'మాధవ శతకము' జిరాక్సు ప్రతిని పంపించారు. తరువాత శ్రీమతి వేమూరి శారదాంబ 'నాగ్నజితీ పరిణయము' ప్రతి కొరకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయనే మాకు ఈ అమూల్యమైన పుస్తకము ఒకటి రాజమండ్రి లోని గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయములో ఉన్నట్లుగామాకు తెలియజేసారు. ఆ మహానుభావుని సహాయము వలననే శారదాంబగారి రచనలు దాదాపు 100 సంవత్సరాల తర్వాత పునర్ముద్రించి సాహితీ సేవ చేసే భాగ్యం కలిగింది. ఆమహాను భావుడే కీ.శే. శ్రీ అరిశెట్టి సాయి ప్రసాద్ గారు. వారు చేసిన అమూల్యమైన ఈ సహాయానికి మేము, మరియు యావత్తు సాహితీ లోకం సర్వదా ఋణపడి ఉంటుంది.

'మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి' ని 1973 సంవత్సరంలో స్థాపించి, శ్రీరామకవి అనేక రచనలలో ఇప్పటివరకు లభ్యమైన పధ్నాలుగు రచనలను పునర్ముద్రించటమే కాకుండా, శ్రీమతి వెలగపుడి వైదేహి (దాసు శ్రీరాములు గారి మునిమనుమరాలు) రచించిన 'మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు – ఒక సమీక్ష' అనే పిహెచ్.డి సిద్ధాంత వ్యాసం ప్రచురించాము.

శారదాంబ తన 'మాధవశతకము' లో నిరక్షరాశ్యులైన స్త్రీల దుర్భర స్థితిని, కళ్ళకి కట్టినట్లు వర్ణిస్తూ "స్త్రీలదుస్థితి సద్వితంబుగ బాపి యిద్ధువిన్, బన్నుగసద్బుధుల్ తగినపట్టున విద్యను ముద్దరాండ్రకున్, గ్రన్నననేరిపించి మరిజ్ఞానము బుట్టగఁ

జేయు” మంటూ దైవాన్ని వేడుకుంటూ ‘స్త్రీ జనక్షేమార్థక భగవత్ప్రార్థనపద్యములు’ వ్రాసారు. అందులో పురాణేతిహాస, చారిత్రిక కాలాలలో స్త్రీలపై ఎటువంటి వివక్ష లేదని సోదాహరణంగా వివరిస్తూ, ప్రస్తుత సమాజంలో ఈవివక్ష స్త్రీలపై ఎందుకు చూపి స్తున్నారని కడు చమత్కారంగాను, పాఠకుల మనసులకు హత్తుకునే విధంగా చిత్రించి, సూటిగా ప్రశ్నిస్తూ స్త్రీలను ఈ దుస్థితినుంచి బయట పడవేసే సద్బుద్ధి పెద్దలకు కలగజేయమని మాధవుణ్ణి వేడుకుంటుంది. దీనిని 1895 ప్రాంతంలో రచించి ఉండవచ్చు. మాకు శ్రీ అరిశెట్టి సాయి ప్రసాద్ గారి ద్వారా లభ్యమైన ప్రతి 1901 లో శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రీ గారి సంపాదకత్వంలో రాజమండ్రి నుంచి ప్రచురితమైన ‘కళావతి’ మాసపత్రిక లో మూడు భాగాలుగా ముద్రింపబడినది.

ఈ అమూల్యమైన పుస్తకమునకు ‘ముందుమాట’ వ్రాసిన ఆచార్య కాత్యాయనీ విద్మహే గారికి మరియు ‘సమీక్ష’ వ్రాసిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి మా కృతజ్ఞతాభినందనలు. ప్రసన్నకవి శ్రీ ఉన్నం జ్యోతివాసు గారు అత్యంత అభిప్రీతితో, సాహిత్యోపాసనా ధర్మనిష్టతో ‘మాధవ శతకము’ కావ్యాన్ని అధ్యయనించి, అవసరమైన చోట పరిష్కరించి, సవిస్తరంగా విశ్లేషించి, రచయిత్రి శారదాంబ యొక్క కవితా కౌశలము, ధిషణ మొదలైన అనేక పార్శ్వాలను ఆవిష్కరిస్తూ ‘ప్రణిధి’ అందించారు. వారికి మాహృదయపూర్వక కృతజ్ఞతలు. ఇటువంటి పీఠికలు ముందుతరం పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంటాయని మాదృఢ విశ్వాసం.

కీ.శే. మహాకవి దాసు శ్రీరాములు గారి రచనలు ‘మహావీరచరితము’, ‘మాళవికాగ్ని మిత్రము’, ‘విక్రమోర్వశీయ నాటక’ అనువాదాలు అచ్చయినప్పటికీ అలభ్యంగా ఉన్నాయి. ఎవరివద్దనైనా ఆరచనలు ఉంటే, మాకు జిరాక్సు ప్రతులు పంపిస్తే, కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరించి వాటిని ప్రచురిస్తాము. భాషాసేవగా భావిస్తాము.

అలనాటి అభ్యుదయవాది, స్త్రీవిద్యాహితైషి, శ్రీమతి వేమూరి శారదాంబ ఒక శతాబ్దముకు పూర్వము రచించిన ఈ ‘మాధవ శతకము’ ను పునర్ముద్రించటం మాకర్తవ్యం మరియు అదృష్టంగా భావిస్తున్నాము. ఆత్మీయులు, ‘కవిమిత్రులు’ శ్రీ వి.వి.సత్యప్రసాద్ గారు అత్యంత గౌరవాభిమానముతో, సాహిత్య సేవా దృక్పథముతో ప్రూఫ్ లు సరిచూచి సహాయము చేసినందుకు వారికి మాకృతజ్ఞతాభి నందనలు.

ఈ పుస్తక పునర్ముద్రణకు హృదయపూర్వక ప్రోత్సాహము ఆర్థిక ఆలంబల నందించిన సోదర సోదరీమణులకు, దాసు వంశీకులకు ‘మహాకవి దాసుశ్రీరాములు స్మారక సమితి’ పక్షం నుంచి కృతజ్ఞతాభినందనలు. ఎంతో ఓపికతో డి.టి.పి అక్షరకూర్పు చేసిన ‘సమంత గ్రాఫిక్స్’ శ్రీ వేమూరి పవన్ కుమార్ గారికి మా అభినందనలు, ధన్యవాదములు.

**డా.దాసు అచ్యుత రావు** 11-01-2019
మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి
హైదరాబాద్

★ ★ ★



**(శారదాంబ గారి కుమారుడు)**
**వేమూరి పార్ధసారధిరావు**
**(1899-1949)**



**(పార్ధసారధిరావు గారి సతీమణి)**
**శ్రీమతి వేమూరి మాణిక్యాంబ**
**(1907-1989)**

# ముందుమాట

**- ఆచార్య కాత్యాయనీ విద్మహే**

తెలుగునాట సంస్కరణోద్యమం, ప్రత్యేకించి స్త్రీ విద్యా ఉద్యమం స్త్రీలలో మేలుకొల్పిన చైతన్యం వాళ్ళను మహిళా ఉద్యమ నిర్మాతలను చేసింది. ఉద్యమ ఆశయాల ప్రచారానికి వారిని రచయితలుగా మలిచింది. కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబ ఆ కోవలోని వారే. వారివలె సామాజిక జీవితం, కార్యాచరణ లేకపోయినా తనకున్న పరిమితులలో సాంస్కృతిక భావజాల రంగంలో స్త్రీ విద్యకు ఒక అనుకూల వాతావరణాన్ని నిర్మించటానికి పనిచేసిన చరిత్రకెక్కని మహిళ వేమూరి శారదాంబ.

1881 మే 3వ తేదీన పుట్టిన వేమూరి శారదాంబ కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబల కన్నా ఏడేళ్లు చిన్నది. కొటికలపూడి సీతమ్మ వీరేశలింగం గారి ప్రత్యక్ష శిష్యురాలు. భండారు అచ్చమాంబ ప్రసిద్ధ చరిత్రకారుడు, తెలంగాణా సాంస్కృతిక ఉద్యమ నిర్మాత అయిన కొమర్రాజు లక్ష్మణరావు సోదరి. ఇద్దరూ వీరేశలింగం ప్రభావాలకు లోనైనవాళ్ళే. స్త్రీల అభ్యుదయాన్ని ఆశించి పని చేసినవారే. సాహిత్య సృజన చేసినవారే. ఇక శారదాంబ ఆంధ్రదేశంలో సాహిత్యసామాజిక సాంస్కృతిక రంగాలలో అభ్యుదయ దృక్పథంతో కృషి చేసిన దాసు శ్రీరాములు గారి కూతురు. భండారు అచ్చమాంబ వలెనే ఈమెది కూడా అకాల మరణమే. ఆమె 21 ఏళ్ళ వయసులో మరణిస్తే ఈమె 19 ఏళ్లకే (1899 డిసెంబర్ 26) రెండవ బిడ్డకు జన్మనిస్తూ మరణించింది.

వేమూరి శారదాంబ పుట్టిన 1881 వ సంవత్సరానికి ఒక చారిత్రక ప్రాధాన్యత ఉంది. వీరేశలింగం దంపతులు మొదటి వితంతు వివాహం జరిపించిన సంవత్సరం అది. అప్పటికే ఆయన స్త్రీవిద్యకు అనుకూల భావప్రచారం ప్రారంభించాడు. వివేకవర్ధని పత్రిక ప్రారంభించి అందుకు స్వంత వేదికను ఏర్పాటు చేసుకున్నాడు. స్త్రీ విద్య శాస్త్ర సమ్మతమేనని ప్రజలలో నమ్మకం కలిగించటానికి పట్టుదలతో పనిచేస్తున్న కాలం అది.

శారదాంబ పుట్టిన రెండేళ్లకు అంటే 1883లో స్త్రీల జ్ఞాన చైతన్యాల వికాసాన్ని ఆశించి స్త్రీల కొరకు ప్రత్యేకంగా సతీహితబోధిని అనే పత్రికను కూడా ప్రారంభించాడు

వీరేశలింగం. ఆ క్రమంలో 1875 నుండి 1885 మధ్య కాలంలో స్త్రీ విద్యపై ఆయన చేసిన ప్రధాన ఉపన్యాసాలు ప్రచురించబడి బుద్ధిజీవుల మధ్య చర్చకు వచ్చాయి. అదే సమయంలో వధూవరుల మధ్య వయో తారతమ్యం కల వివాహాలు దాంపత్యంలో స్నేహానికి అవరోధమని, కన్యాశుల్క వివాహాలు నరమాంస విక్రయ వ్యవహారమేనని ఏవగించుకున్నాడు వీరేశలింగం. ఆయన ఆదర్శాలు సామాజిక మానవీయ సంస్కారాలలో, సంబంధాలలో ప్రతిఫలించే వాస్తవంగా పరిణమించటాన్ని కలగంటూ 1887 నాటికి గురజాడ కన్యాశుల్క నాటకంతో రంగంలోకి వచ్చాడు.

అప్పటికి శారదాంబ ఐదారేళ్ళ పిల్ల. ఆడపిల్లల విద్యా వ్యాసంగం పట్ల, స్త్రీల స్వశక్తి సాధన పట్ల శ్రద్ధాసక్తులు గల తండ్రి దాసు శ్రీరాములు గారి పెంపకంలో ఆమె సంగీతసాహిత్య విద్యాభ్యాసం అప్పటికే గొప్ప క్రమశిక్షణతో ప్రారంభం అయి ఉండాలి. లేకపోతే తొమ్మిదవయేట అనుపమాన ప్రజ్ఞతో వీణ వాయించటం గానీ, పదునాలుగేళ్లకే పద్య మల్లటం గానీ, పదహారవ సంవత్సరంలో నాగ్నజాతీ పరియణ ప్రబంధ రచన గానీ సాధ్యమయ్యేవి కావు. పదునాలుగేళ్ళ వయసులో అంటే 1895లో ఆమె అల్లిబిల్లిగా అల్లిన ఆ పద్యాలే మాధవ శతకం అయి ఉంటుంది. అప్పటికి తెలుగు జనానా, స్త్రీ హిత బోధిని, శ్రీ బాలిక అనే మరో మూడు స్త్రీల పత్రికలు ప్రారంభం అయ్యాయి. సతీహితబోధిని తో కలిపి ఈ పత్రికలన్నీ ప్రధానంగా స్త్రీవిద్య, పాతివ్రత్యం, బాల్యవివాహాలు గృహనిర్వహణ, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొదలైన అంశాలను చర్చించేవి. ఆ చర్చల ప్రభావం నుండి రూపొందిన వ్యక్తిత్వమే మాధవ శతకం రాయటంలో శారదాంబకు చోదక శక్తి అయింది. ఈ శతకం ఆమె మరణానంతరం రెండేళ్లకు 1901లో కలావతి అనే మాసపత్రికలో ప్రచురించబడింది.

కథతో నిమిత్తం లేకుండా ఎక్కడికక్కడ ఒక భావాన్ని, అభిప్రాయాన్ని పూర్తి చేయటానికి వీలుగా చేసే వ్యస్త పద్య రచన శతకం. పద్య రచనాభ్యాసానికి అనువైన ప్రక్రియ. అయితే మాధవ శతకంలో వ్యస్త పద్యాల మధ్య 'స్త్రీజన క్షేమార్థక భగవత్ప్రార్థన' అనే ఏక సూత్రతను ఏర్పరచుకున్నది శారదాంబ.

శతకం అంటే వందే. కానీ సాధారణంగా తెలుగు సాహిత్య సంప్రదాయంలో శతకం అంటే నూట ఎనిమిది పద్యాల రచన అన్న రూఢి ఏర్పడిపోయింది. మాధవ శతకంలో పద్యాల సంఖ్య నూట ఒక్కటి (101). మాధవా అన్న సంబోధన మకుటం.

ఏక వృత్త నియమం పాటించలేదు. ఉత్పలమాల చంపక మాల వృత్తాలు ఎక్కువ. అక్కడక్కడా శార్దూల మత్తేభ వృత్తాలు కూడా ఉన్నాయి. మొదటి ఆరు పద్యాలూ, చివరి దశావతార స్తుతి పద్యాలతో కలిపి పదకొండు పద్యాలు మినహా మిగిలనవన్నీ 'స్త్రీజన క్షేమార్థక భగవత్ప్రార్థన పద్యాలు'. కనుక మాధవ శతకాన్ని భక్తి శతకం అనటం కన్నా సంస్కరణ భావ ప్రచార శతకం అనటం సముచితం.

ఈ శతకంలో మొదటి ఆరు పద్యాలూ పీఠిక వంటివి. దయతో తనను కాపాడమని శ్రీ రాముడిని స్తుతిస్తూ కోరటం ఆ పద్యాల సారం. "శ్రీ రమణీ మనోహర సుశీల నిజాశ్రిత కష్టభంజనా" అని ప్రారంభం అయ్యే మొదటి పద్యంలో నాలుగవ పాదం "సారస నేత్ర నాదగు విచారములెల్లను దీర్చి మాధవా". ఇందులో నాదగు విచారములెల్లను దీర్చమని మాధవుడిని కోరింది కవయిత్రి. నాదగు అనే మాట ఉత్తమ పురుష ఏకవచనమే. కానీ ఆమెకు వ్యక్తిగత విచారాలు ఉన్నట్లు తరువాతి పద్యాలలో ఎక్కడా కనబడదు. ఆమె విచారం అంతా స్త్రీలందరి కోసం. అందువల్ల ఆమె విచారం వ్యక్తిగతమైంది కాదు అన్నది స్పష్టం.

నాలుగవ పద్యం నాలుగవ పాదం ముగింపులో "నీవ గతి మాకిల వేఱిక లేరు మాధవా" అన్న వాక్యంలోని 'మాకు' అన్న ఉత్తమ పురుష బహువచనం ఆమె విచారాలన్నీ సమూహానికి సంబంధించినవే అని రూఢి చేస్తున్నది. అందువల్ల శారదాంబ 'నేను' అన్నా 'మేము' అన్నా ఆ మాటలన్నీ తనను తాను స్త్రీ జన ప్రతినిధిగా సంభావించుకొని అన్నవే. నాదగు వివరాలు అంటూ స్త్రీల విచారాల గురించి తపన పడి కవిత్వం రాసిన శారదాంబ నాగొడవ అంటూ లోకం గొడవను తన గొడవగా కవిత్వం చేసిన కాళోజికి ఒక తరం వెనుకటి మనిషి. ప్రపంచపు బాధను తన బాధగా చేసుకొని మరో ప్రపంచాన్ని కలగంటూ శ్రీశ్రీ కవిత్వం రాసిన కాలం కంటే ముందే వివక్షకు గురి అవుతున్న మహిళల బాధను తన బాధగా చేసుకొని కవిత్వం అల్లిన మహిళ శారదాంబ.

సాధారణంగా భక్తి శతకాలలో మోక్ష కాంక్ష ఉంటుంది. కానీ శారదాంబ తనను బుద్ధిశాలినిగ బ్రోవుమని (6) కోరింది. వ్యక్తిగత పారలౌకిక విలువలకన్నా లౌకిక సామాజిక విలువల కోసం ఆలోచించగలిగే బుద్ధిని ఆకాంక్షించటంలో వుంది ఆమె విశిష్టత. అలాగే ఆమె స్త్రీ కావటం వల్లనే భగవంతుడు కాపాడిన పురుషులు ఎంతమందో ఉండగా ద్రౌపదిని, అహల్యను మాత్రమే ప్రస్తావించిందనిపిస్తుంది.

ఈ శతకంలో ఎక్కువ పద్యాలు ఆనాటి స్త్రీవిద్యా వివాదానికి సంబంధించినవి, స్త్రీవిద్య అవసరం, ప్రాధాన్యత, ప్రయోజనం – నిరూపించటం, అందుకు మద్ధతుగా చారిత్రక పౌరాణిక స్త్రీలను ఉదాహరణగా పేర్కొనటం, స్త్రీవిద్య వ్యతిరేక వాదనలను తిప్పికొట్టటం, స్త్రీవిద్య సాధనకు పూనుకొనమని పురుషులను ఉద్బోధించటం – లక్ష్యంగా శారదాంబ ఈ శతక పద్యాలు రాసింది.

శారదాంబ దృష్టిలో విద్య అంటే అక్షరాస్య విద్య. స్త్రీలను రోకటి పాటలు పాడుకొనే స్థితి నుండి రామాయణ భారతాది పురాణ కథలను గ్రంథ పరిశీలన చేత అర్థం తెలిసి చదువుకునే దశకు చేర్చే విద్య (33). బాల చికిత్స, చరిత్ర, భూగోళ సమాచారం, లెక్కలు, దేశ భాషలో చక్కగా రాయగల నైపుణ్యం స్త్రీ విద్యకు ఆమె ఇచ్చిన సిలబస్ (57). సంగీత నాట్య చిత్రలేఖనాది లలితకళలు కూడా స్త్రీలు నేర్వవలసినవే అన్నది ఆమె అభిప్రాయం. ఈ క్రమంలోనే స్త్రీలకు విద్య అంటే పురాణ శ్రవణం, నోములునోచటం అనే సంప్రదాయ భావనను శారదాంబ తిప్పికొట్టింది. పురాణ శ్రవణం వల్ల బోధ కలగదని (54), నోములు నోచటం వృధాగా పొద్దు పుచ్చటమేనని (66) అంటుంది. సంగీత నాట్యాలు భోగం వేషాలుగా తిరస్కరింప బడుతున్న తరుణంలో శారదంబ సంగీత నాట్య విద్యలు నేర్చుకొనే అవకాశం మహిళలకు ఉండాలి అనటం సాహసమే.

బోగపు సానుల పాట వింటూ ఇటువంటి పాట ఎక్కడా వినలేదని మెచ్చుకునే పెద్దమనుషలను గృహిణులకు ఆ సంగీత జ్ఞానం ఇచ్చే పనికి ఎందుకు ముందుకు రారని నిలదీసింది (29). ఉత్తర నాట్యం నేర్చుకోలేదా, యోగ్యురాలని కీర్తి పొందలేదా? స్త్రీలు నాట్యం నేర్చుకొనటానికి అభ్యంతరాలు ఎందుకు అంటుంది (32). ఉషా అనిరుద్ధుల కథలో చిత్రరేఖను ప్రస్తావించి ఆ నేర్పు ఉన్న స్త్రీలకు చిత్రలేఖనం నేర్పవచ్చు కదా అంటుంది (48). ఈ అన్ని సందర్భాలలోనూ స్త్రీలసృజన శక్తి సామర్థ్యాలను వెలికి రానీయకుండా చేస్తున్న సంప్రదాయం పట్ల, పురుష బద్ధుల పట్ల ఆమె విమర్శ దృష్టి కనబడుతుంది.

స్త్రీలకు విద్య ఎందుకు అవసరం? భర్తకు ఇంటి నిర్వహణలో చేదోడు, వాదోడు కావటానికి, లేఖలు చదువుకొనటానికి, రాయటానికి, వార్తా పత్రికలు చదివి వినిపించడానికి, పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి పెంచటానికి, ఇరుగు పొరుగు స్త్రీ

లతో కలహాలు మాని జీవించటానికి ఇట్లా ఆనాటి సంస్కరణోద్యమం ఏమి చెప్పిందో దాదాపు వాటినే శారదాంబ తన పద్యాలలో ప్రస్తావించింది. కార్యేషు మంత్రి అంటారు కదా, విద్య లేని మహిళ మంత్రి ఎలా కాగలుగుతుంది అని ప్రశ్నించి పడతులు విద్య నేరిస్తే పతులకు సహాయపడతారని అంటుంది (27). మగవాడికి అర్ధ శరీరమైన ఆడది చదువు లేనిదైతే మగవాడి సగభాగం చచ్చు పడిపోయినట్లే అని ఆమె భావించింది. ఆడది చదువుకుంటేనే మగవాడు సంపూర్ణుడు సుందరుడు అవుతాడని చెప్పింది. అందువల్లనే స్త్రీ విద్యకు సుముఖులయ్యే సద్బుద్ధిని పురుషులకు ఇమ్మని భగవంతుడిని వేడుకొన్నది. స్త్రీలను జ్ఞానవంతులను చేసే పనికి పూనుకొనమని పురుషులను ఉద్బోధించింది.

ఆడవాళ్లు చదువుకుంటే చెడిపోతారు, భర్తను గౌరవించరు, స్వాతంత్ర్యం కోరతారు – అనే విద్యా వ్యతిరేక వాదుల అభ్యంతరాలను తగిన తర్కంతో తోసి పుచ్చింది శారదాంబ. స్వతంత్రం ఇమ్మంటే ఇచ్చేది కాదు, తమకు ఏది తగునో ఏది తగదో ఎరిగి పొందేదీ అన్నది ఆమె భావం. బాగా చదువుకున్న స్త్రీలకే ఆ వివేకం ఉంటుందని ఆమె నమ్మకం (79). మహిళల చదువుకు ఉన్న అభ్యంతరాలలో మగవాళ్ల వద్ద చదువుకోవాల్సి వస్తుందన్నది మరొకటి. ఆడవాళ్లు నోములు చేస్తున్నప్పుడు పూజ చేయించే పురోహితుడు పురుషుడు కాదా అప్పుడు లేని సందేహం ఇప్పుడు ఎందుకు వచ్చింది అని నిలదీసిన పదునున్న లౌకిక జ్ఞానం ఆమెది. మహిళలు చదివి ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్ళేలాలా అని ఎద్దేవా చేసేవాళ్లకు సమాధానం ఇచ్చేక్రమంలో విద్య అంతిమ ప్రయోజనం జ్ఞానం పెరగటమే నని (71) ప్రకటించింది.

అయితే శారదాంబ దృష్టిలో జ్ఞానం జ్ఞానం కోసం కాదు. జ్ఞానం సకల మేధో శక్తుల వికాసనానికి, ఆవిష్కరణకు, మహిళల చదువుకు సమాజంలో ఒక ఆమోదాన్ని సంపాదించటానికి చరిత్ర నుండి, పురాణాలనుండి ఉదాహరణలుగా తెచ్చి చూపిన లీలావతి వంటి శాస్త్రవేత్తలు, దేవహూతి వంటి వేదవేత్తలు, మొల్ల, తరిగొండ వెంగమాంబ వంటి కవులు, కైక, సత్య వంటి యుద్ధ వీరులు – బహు ముఖీనమైన శక్తి సామర్థ్యాలు చూపగల స్త్రీల అస్తిత గురించిన శారదాంబ ఆత్మ గౌరవ చేతనకు ప్రబల సాక్షులు.

ఈ శతకంలో శారదాంబ ప్రస్తావించిన స్త్రీల జాబితా తయారు చేసి చూస్తే స్త్రీ విద్యకు స్ఫూర్తిని ఇచ్చే మహిళా శక్తుల సమీకరణకు ఆమె తీసుకున్న శ్రద్ధ అర్థం అవుతుంది. సమకాలపు జనవ్యవహారం నుండి సేకరించి చెప్పిన విద్యావంతులైన మహిళల గురించిన సమాచారం మరీ ఆసక్తికరంగా ఉన్నది. వింజమూరి తిమ్మక్క ద్విపద ఛందస్సులో డోలాయాత్ర అనే గ్రంథం రాసినట్లు (65) ఆమె చెప్పినది ఏ సాహిత్య చరిత్ర లోనూ నమోదు అయిన విషయం కాదు. పెద్ది భొట్లు సతి వంటి స్వంత పేరు లేని అంచులకు నెట్టివేయబడిన స్త్రీల పాండిత్యం గురించి – ఎక్కడ విన్నదో కానీ – ఆలోచించమని మనలను ప్రేరేపిస్తుంది (21). అల్లసాని పెద్దన మనుచరిత్ర రాస్తూ గర్భిణి స్త్రీని ఎలా వర్ణించాలా అని ఆలోచిస్తుండగానే ఆయన కూతురు ఆ పని విజయవంతంగా పూర్తి చేసి పెట్టిందని (44) చెప్పి శారదాంబ వినియోగంలోకి రాని స్త్రీల శక్తి సామర్థ్యాల వైపు మన దృష్టిని మళ్ళించింది. అంతే కాదు స్త్రీల ప్రత్యేక శారీరక మానసిక సంస్పందనలను, జీవితానుభవాలను వర్ణించటం ఎంత పెద్ద కవికి అయినా అంత సులభం కాదని, స్త్రీలు కవులైతే అలవోకగా ఆ పని చేయగలుగుతారని ఏక కాలంలో చెప్పినట్లయింది. పందొమ్మిదివందల ఎనభైలలో తెలుగు సాహిత్య లోకంలో వ్యాప్తిలోకి వచ్చిన ఈ స్త్రీవాద భావనను వంద సంవత్సరాల క్రితమే ఒక తెలుగు కవయిత్రి పలికించ గలిగిందంటే స్త్రీవాదం విదేశీయం కాదని, తరతరాల ప్రపంచ స్త్రీల మనోభావాల అనుభవాల కోణం నుండి అభివృద్ధి చెందిన సిద్ధాంతమని రూఢి అయినట్లే కదా!

స్త్రీలపట్ల సమాజంలోని వివక్ష పట్ల శారదాంబకు ఒక అవగాహన ఉంది. శివుడు గంగను నెత్తిన పెట్టుకుంటాడు. బ్రహ్మ సరస్వతిని నాలుక యందు, విష్ణువు లక్ష్మిని గుండెల్లోనూ పెట్టుకొంటే ఈ లోకంలో మగవాళ్ళు వాళ్ళను ఎందుకు చిన్న చూపు చూస్తారన్నది ఆమె వేదన (9). లింగ వివక్ష వల్ల జీవితంలో భాగమవుతున్న ద్వంద్వ విలువల గురించిన అవగాహన కూడా శారదాంబకు ఉంది. 'పలదనుటెట్లు విద్య మగవారల కెట్టుల నట్టులే కదా' అని (19) ఆడవాళ్లు మగవాళ్ళతో సమానమేనన్న సాధారణ సూత్రాన్ని సౌకర్యవంతంగా మరచిపోయిన పురుష సమాజానికి చురక వేసింది. లలనలు నాలుగక్షరములు చదివినంత మాత్రాన అది చదువు కాదు అని కూడా ఆమెకు తెలుసు. పురుషులతో పాటు సమంగా తెలివి పొందే అవకాశాల గురించిన స్వప్నం ఆమెది (19). చదువు వల్ల ఆడవాళ్ళు చెడి

పోతారనే వాదాన్ని నిరసిస్తూ చదువు వల్ల చెడిపోతారంటే మగవాళ్ళు కూడా చెడిపోతారు కదా, మరి వాళ్ళెందుకు చదువుతున్నారు అని ప్రశ్నించింది (72).

ఆడపిల్లలకు ద్రౌపది వంటి పేర్లు పెడితే బోగం కులం పేర్లు అని అంటారు కదా! మగవాళ్లకు కృష్ణుడి పేరు ఎలా పెడతారు అని ఆమె వేసిన ప్రశ్న లైంగిక ద్వంద్వ విలువల మీద ఎక్కు పెట్టిన బాణమే (81). ఐదుగురు భర్తలు ఉన్నందున ద్రౌపది పేరే అపవిత్రం అయిపోతే పదహారువేల భార్యల ఉన్న కృష్ణుడు పూజ్యుడైనా డన్నది ఆమె ఆంతర్యం. అంతే కాదు, స్త్రీలకు గొడుగు పట్టుకొని వీధులలో నడవటాన్ని నిషేధించి, తలుపులు మూసిన పల్లకీలలో, బండ్లలో బంధించి ప్రయాణాలు చేయించటంతో ఆగక బురఖా కూడా వేసి ఊపిరి ఆడనీయకుండా చేస్తున్న విధానాలమీద ఘాటైన విమర్శపెట్టింది (82&83). బాల్య వివాహాలను, వృద్ధులకు ఇచ్చి చేసే వివాహాలను వ్యతిరేకించింది. తగిన వయసు వచ్చాక నచ్చినవాడిని పెళ్లాడే వెసులు బాటునిచ్చే స్వయంవర వివాహపద్ధతిని విస్మరించటం పట్ల విచారం వ్యక్తం చేసింది (86).

శారదాంబ కొటికెలపూడి సీతమ్మ వలెనే వీరేశలింగం పంతులు గారి సంస్కరణోద్యమ భావజాల వారసత్వానికి సమకాలంలో మొగ్గ విచ్చుతున్న మహిళా ఉద్యమ ఆకాంక్షలకు మధ్య బలమైన లంకె. ఈ శతకం చదువుతుంటే 1914 ఏప్రిల్ 11 & 12 తేదీలలో బెజవాడలో జరిగిన అయిదవ ఆంధ్ర మహిళా సభ ఉపన్యాసాలు, తీర్మానాలు గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా శారదాంబ తన పద్యాలలో స్త్రీల విద్యకు అభ్యంతరాలుగా వేటిని సంబోధించిందో, ఖండించిందో అవన్నీ మోటుపల్లి రాజబాయమ్మ ఉపన్యాసంలోనూ కనిపిస్తాయి. రాజా బాయమ్మ విద్యావంతులైన స్త్రీల వారసత్వాన్ని చెప్పటంలో భాగంగా దేవహూతీ లీలావతులను పాండిత్యాన్ని, ఉత్తరా చిత్రరేఖల కళా కౌశలాన్ని, గర్భిణీ స్త్రీ వర్ణన చేసిన పెద్దన కూతురి కవన నైపుణ్యాన్ని ప్రస్తావించటం శారదాంబ శతక పద్య విషయాలే.

అలాగే ఆ సభలో దాదాపు అందరి ప్రసంగాలలోను చర్చించబడిన మరొక అంశం నగల పై మహిళల వ్యామోహం. దానిని మూఢత కింద జమకట్టి తిరస్కరించారు సంస్కరణాభిలాషులైన స్త్రీలు. అందుకు కూడా ఒరవడి పెట్టిన మహిళ శారదాంబ. స్త్రీలలో నగల మోజు, అలంకరణ ప్రీతి అభ్యుదయ కారకాలు

కావని ఆమె అభిశంసించింది. సహజమైన తెలివి ఉండాలి కానీ నగలు ఎందుకు అంటుంది (53). నగల మీద పెట్టె శ్రద్ధ చదువు మీద పెట్టమని మహిళలను హెచ్చరించింది (69). నగల కోసం చెవులు, ముక్కులు కుట్టించుకొని శరీరాన్ని హింస పెట్టుకొనటం కన్నా చదువు పై శ్రద్ధ పెడితే ప్రయోజనమని హితువు చెప్పింది (70). తల దువ్వు కొనటానికి, బొట్టు దిద్ది చీర కట్టటానికి, నగలు పెట్టుకొనటానికి -- ఇలా అలంకరణకు గంటలు గంటలు కాలాన్ని వ్యయం చేసేవాళ్ళు అందులో కొంత సమయం విద్య కొరకు కేటాయిస్తే బాగుంటుందని సూచించింది (68). నగలపట్ల, అలంకరణల పట్ల స్త్రీలు విముఖులు కావాలని స్త్రీజన క్షేమార్థం శారదాంబ ఏదైతే ఆశించిందో, దానితో పాటు ఆడవాళ్లు వీధుల్లో గొడుగులు వేసుకొని నడవరాదన్న నాటి సామాజిక వివక్షను దేనినైతే నిరసించిందో (82) ఈ రెండూ కూడా ఐదవ ఆంధ్ర మహిళా సభలో తీర్మానాలుగా ప్రవేశపెట్టబడి ఆమోదించబడిన తీరు గమనిస్తే స్త్రీల ఆకాంక్షలు ఆచరణాభిముఖమైన ఉద్యమ రూపాన్ని తీసుకొంటున్న దృశ్యం దర్శనమిస్తుంది.

ఆ ఐదవ ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షురాలు కొటికెలపూడి సీతమ్మ. ఆమె తన ఉపన్యాసం ముగిస్తూ స్త్రీ విద్యా ద్వేషుల వాదములను జయించి, పుస్తకాలను రచించి, పాఠశాలలు స్థాపించి, తోడి పురుషులలో స్త్రీ విద్యాభిమానము పురికొల్పుటకు సభలలో ఉపన్యాసములు ఇచ్చిన పూర్వీకులను కృతజ్ఞతతో ప్రస్తావించింది. ఆ పూర్వీకులలో శారదాంబ ఒకరు. ఆ కృతజ్ఞతలలో వాటా ఆమెకు కూడా ఉంది.

తెలుగు నాట తొలినాళ్ళ మహిళా ఉద్యమానికి సంస్కరణోద్యమ వారసత్వాన్ని స్త్రీల కోణం నుండి అందించటం ద్వారా తన వంతు చారిత్రక పాత్రను నిర్వహించిన శారదాంబను తెలుసుకొనటానికి నాకు ఈ విధంగా అవకాశం కల్పించిన దాసు అచ్యుత రావు గారికి కృతజ్ఞతలు.

పశ్యంతి

15-1-2017 **కాత్యాయనీ విద్మహే**

# సమీక్ష

**– ఆచార్య బేతవోలు రామబ్రహ్మం**

మాధవా అని మకుటం ఎంచుకోవడంలోనే ఉంది గడుసుదనమంతా. చంపకోత్పలాలకూ, శార్దూల మత్తేభాలకు ఇంకా అనేక వృత్తాలకూ సరిపోయే మకుటమిది. ఛందస్సు పరంగా చాలా స్వేచ్ఛ లభిస్తుంది. ఆ స్వేచ్ఛను శారదాంబగారు సద్వినియోగం చేసుకున్నారు.

నిండా పదహారేళ్ళయినా రాకముందే 'నాగ్నజితీ పరిణయము' అనే ప్రౌఢ కావ్యాన్ని, ఈ శతకాన్నీ ఇంకా కొన్ని కీర్తనలనీ వీరు రచించగలిగారంటే ఎంతటి ప్రతిభా సంపన్నురాలో ఎంతటి కుశాగ్రబుద్ధియో గ్రహించవచ్చు. కనుకనే 'బాలేందు తుల్యాళికా' (3), 'దురితకుంజర సింహ' (5), 'శారదా భాసను కీర్తిపూరిత దిగంతర వైభవ చంద్ర' (101) లాంటి సంబోధనలు కట్టగలిగినారు.

స్త్రీజన సంక్షేమంకోసం భగవంతున్ని ప్రార్థించడం ఈ శతకంలోని ప్రధానాంశం. ఇది భక్తిశతకం కాదు. సాంఘిక శతకమే. ఏదైనా ఒక సామాజిక అంశంకోసం భగవంతున్ని ప్రార్థించడమంటే సమాజం బండబారితనాన్ని చాటి చెప్పడమే. స్త్రీలను గౌరవించడం స్త్రీలను చదువుకోనివ్వడం – వీటికి అనుకూలంగా పురుషుల చిత్తవృత్తుల్ని మార్చమని మాధవున్ని ప్రార్థించారు వీరు. అంటే, ఆ మేరకు పురుష సమాజానికి వాత పెట్టడమే.

పురాతనకాలంలో పురుషులతో సమంగా విద్యావంతురాండ్రయిన స్త్రీలున్న ఈసమాజంలో ఎందుకో మధ్యయుగాలలో పురుషులకు విపరీత బుద్ధులు పుట్టుకువచ్చాయి అంటూ, స్త్రీవిద్యను వ్యతిరేకించేవారికి చాలా ఘాటుగా సమాధానాలు చెప్పారు ఈ కవయిత్రి.

చదువుకున్న మగవాడు చదువురాని మగువను మనువాడితే ఆ సంసారం ఒక బండికి గుర్రాన్నీ దున్నపోతును కట్టి తోలుతున్నట్టు ఉంటుందట. అందుకని మగువలు అందరూ చదువుకుంటేనే చదువుకున్న మగవాళ్ళకు తగిన జోడి దొరుకుతుందని హెచ్చరించడం మగవాళ్ళను ఒప్పించే గడసరి ప్రయత్నం!

యోగ్యతలు చదువువల్ల రావు, పుట్టుకతోనే రావాలి అనేట్టయితే మగవాళ్ళు మాత్రం చదువుకోవడమెందుకు? (60). గవ్వలాటలూ దంపుడు పాటలతో కాలంగడపడంకనన్నా వనితలు ఆ సమయాన్ని చదువుకి వినియోగించడం మంచిది గదా! (64). ఆడపిల్లలకు ద్రౌపది అని పేరు పెడితే తప్పుపడతారు, మగవాళ్ళు కృష్ణుడు అని పేరు పెట్టుకుంటే తప్పు లేదా మరి? (81). ఇల్లాలు చదువుకుంటే తనకు పుట్టిన ఆడపిల్లలకు తానే చదువు నేర్పుతుంది. ఇది మగవాడికి ఆర్థికంగా లాభమే కదా! (84). ఇంకొక్క అడుగు ముందుకు వేసి – సీతాదేవిని కానిచోట్లకు కసరచు తెచ్చితార (97) అనిరామున్ని సైతం ఆక్షేపించేశారు.

ఇప్పటికి నూట ఇరవై సంవత్సరాల క్రితం ఆంగ్లభాష ఏమీ నేర్వని ఒక కవయిత్రి, రెండుపదులైనా నిండకుండానే కన్ను మూసిన వేమూరి శారదాంబగారి విప్లవాత్మక రచన ఈ మాధవశతకము. దీన్ని కాలగర్భంలో కలసిపోనివ్వకుండా పునర్ముద్రించి లోకానికి అందిస్తున్న మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి వారిని కృతజ్ఞతాపూర్వకంగా అభినందిస్తున్నాను.

సెలవు

హైదరాబాద్ — భవదీయుడు

29-1-2017 — **బేతవోలు రామబ్రహ్మం**

# ప్రణిధి

– 'ప్రసన్న కవి' **ఉన్నం జ్యోతివాసు**

పూర్వం ఒక కన్యఉంది. ఆమె సంస్కృతం బాగా చదువుకుంది. తనకు కాబోయే భర్తకూడా బాగా చదువుకొని ఉండాలని కోరుకుంది. ఆమె తండ్రి ఒక వరుడిని వెతికి తెచ్చాడు. అతనితో ఆమె సంభాషించింది. దాంతో అతని భాషా పాండిత్యాలు బయటపడ్డాయి. అప్పుడామె తన తండ్రితో ఇలా అంది.

**యస్య షష్ఠీ చతుర్థీ స్యా ద్విహస్యచ విహాయచ ।**
**అహం కథం ద్వితీయాస్యాత్ ద్వితీయాస్యా మహం కథమ్ ॥**

'నాన్నా! 'విహస్య' అన్నది షష్ఠీ విభక్తి అనీ, 'విహాయ' – అన్నది చతుర్థీ విభక్తి అనీ, 'అహం', 'కథం' – అన్న పదాలు ద్వితీయావిభక్తి అనీ ఈ వరుడు చెబుతున్నాడు. ఇతనిని నేనెలా పెండ్లి చేసుకొనేది' – అని అంది.

ఇక్కడ విహస్య, విహాయ – అనేవి అవ్యయాలు. అహం – అనేది ప్రథమా విభక్తి. కథమ్ – అవ్యయం. ఆ వరునికి రామ శబ్దం మాత్రమే తెలుసు. ఆ రామ శబ్దం పోలికను పట్టి పైన చెప్పిన పదాల విభక్తులను చెప్పి నవ్వుల పాలయ్యాడు. ఆ తండ్రి ఎవరో కాదు మహాపండితులు అప్పయ్యదీక్షితులవారు. ఆ కన్య అతని కూతురు. ఆ విదుషీమణి పేరు కూడా మనకు తెలియకపోవడం మన దురదృష్టం.

ఇది క్రీ.శ. 16వ శతాబ్దం నాటి సంఘటన. అప్పటికి స్త్రీల పట్ల వివక్ష తీవ్రంగా ఉంది. కాని వేదకాలం (క్రీ.పూ. 1200 ప్రాంతాల)లో స్త్రీ, పురుషులకు సమానహక్కు లుండేవి. స్త్రీ వ్యక్తిత్వం విశిష్టతను సంతరించుకున్న కాలమది. వేదకాలంలో జనక మహారాజు కొలువులో యాజ్ఞవల్క్య పండితుడు ఉండేవాడు. అశ్వలుడు, కహోళుడు, ఉషస్యుడు – వంటి కొమ్ములు తిరిగిన పండితులు అతనితో వాదంలో ఓడిపోయారు. అటువంటి మహావిద్వాంసుడితో 'గార్గి' – అన్న విదుషీమణి అతనితో వేదాంత వాదంలో తలపడింది. చిత్తు చిత్తుగా ఓడించింది. ఆ కాలంలోనే కక్షివానుడనే రాజర్షి తాను ఋక్కులు వ్రాయడమే గాక, తన కూతురైన 'ఘోషా' చేత కూడా కొన్ని ఋక్కులు వ్రాయించిన విశిష్ట నాగరిక యుగమది.

పూర్వ కల్పాలలో స్త్రీలకు వేదాభ్యాసం ఉండేది. గోధ, ఘోష మొదలైన స్త్రీలు వేద మంత్రాలను దర్శించినట్లుగా వైదికవాఙ్మయం చెబుతుంది. అప్పటి స్త్రీలు సద్యోవధువు లని, బ్రహ్మావాదినులని రెండురకాలు. బ్రహ్మావాదినులకు ఉపనయన,

వేదాధ్యయనా లున్నాయి. సద్యోవధువులకు లేవు. సద్యోవధువులకు వేదం వద్దంటే అసలు మొత్తం వేదం వద్దని కాదు. వైదిక కర్మలకు సంబంధించిన మంత్రాలను వాళ్లు నేర్చుకోవాల్సిందే.

మధ్యయుగంలో కాలమాన పరిస్థితులు మారిపోయాయి. మహ్మదీయులు, ధగ్గులు, పిండారీలు మొదలైనవారి దాడులు, దురాగతాల కారణంగా స్త్రీలకు రక్షణ అవసర మయింది. అందుకోసం రూపొందించిన అనాగరిక చట్టాలు, ధర్మాలు స్త్రీ స్వేచ్ఛను హరించివేశాయి. అందువలన స్త్రీలు చైతన్యానికి దూరమయ్యారు. దానికి తోడు మూఢనమ్మకాలు ముమ్మరమై వాళ్లు అజ్ఞానాంధకారంలో బానిస బ్రతుకులు బ్రతికారు.

మనుధర్మ శాస్త్రం, మహాభారతం వంటి ప్రామాణిక ధర్మశాస్త్ర గ్రంథాలలో స్త్రీల పట్ల, కులాలపట్ల ఆంక్షలు రుద్దుతూ నాటి పండితులు ప్రక్షిప్త శ్లోకాలు చేర్చారు. ఇది వాళ్ల స్థితిని దిగజార్చింది. స్త్రీలు చపలురు కనుక అప్పు వంటి నేరాల విచారణలో వాళ్ల సాక్ష్యం పనికిరాదన్నారు. సాహిత్యం కూడ వాళ్లను చిన్నచూపు చూసింది. నాటక సాహిత్యంలో ఉన్నత వంశ స్త్రీ పాత్రలకు కూడ నీచపాత్రలకు వాడే ప్రాకృతాలను వాడి వాళ్ల స్థాయిని మరింత దిగజార్చింది.

తాను లేనిదే లోకంలో ధర్మశాస్త్ర వాఙ్మయమే లేదని, ప్రపంచ సాహిత్యం లోనే తనవంటి మనస్తత్వశాస్త్ర పారంగతుడు లేడని కొనియాడబడ్డవాడు వ్యాసుడు. అతని భారతంలో స్త్రీని చులకన చేసిన ప్రక్షిప్త శ్లోకాలు బోలెడు కన్పిస్తాయి.

**చలస్వభావా దుస్సేవ్యా దుర్గ్రాహ్యా భావతస్తథా ।**
**ప్రాజ్ఞస్య పురుషస్నేహ యథావాచస్థథా స్త్రియః ॥ – అనుశాసనికపర్వం**

స్త్రీలు చపలచిత్తం కలవాళ్లు. అతి కష్టంతో కూడ సేవించడానికి అలివికాని వాళ్లు. వాళ్ల స్వభావం అర్థం కాదు. పండితుల మాటల్లాగే వాళ్లు కూడా అర్థం కారనీ –

**'మత్స్యపాదం జలేషశ్యేన్న నారీ హృదయ స్థితమ్' ।**

నీటిలోని చేప పాదాన్నైనా చూడగలంగాని స్త్రీ హృదయం అర్థం కాదనీ – అన్నాడు. క్రీ.శ. 17వ శతాబ్దం వాడైన షేక్స్పియర్ కూడ మానవ మనస్తత్వశాస్త్ర కుశలునిగా ప్రసిద్ధుడు. అతడు కూడ స్త్రీని గురించి –

*'Frailty thy name is woman'*. (చపల చిత్తమా! నీ పేరు స్త్రీ. అంటే బుద్ధి నిలకడలేదని అర్థం) అని తన ప్రసిద్ధ నాటకం 'హామ్లేట్'లో ఒక పాత్ర చేత అన్పిస్తాడు. తన మరొక రచన *The winter's tale'* లో కూడ –

*For every inch of woman in the world*
*Ay, every dram of woman's flesh is false.*

– ఈ ప్రపంచంలో ఆడదాని అణువణువూ అబద్ధమే నంటాడు. కాని ఇవన్నీ కాలదోషం పట్టిన నిర్వచనాలు. ఆధునిక స్త్రీ ఈ అవరోధాలను విజయవంతంగా అధిగమించి ప్రశంసా పాత్రమయింది.

కాని ఇది ఒక్కనాడు వచ్చిన చైతన్యం కాదు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు, రాజారామోహనరాయ్, జ్యోతీరావుపూలే వంటి మహనీయులు స్త్రీ సర్వతోముఖాభివృద్ధికి చేసిన కృషి ఫలితమిది. స్త్రీలు అహింసావాదులని, ఉదాత్త స్వభావులని ఆ మహనీయులు ప్రబోధించారు. స్త్రీ విద్యకు బీజాలు నాటారు. అలా మొలకెత్తిందే మన బాల విదుషీమణి దాసు శారదాంబ.

ఆమె 1881 మే 3వ తేదీన కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలో ఉన్న అల్లూరు గ్రామంలో జన్మించింది. దాసు జానకమ్మ, శ్రీరాములు గార్లు ఆమె తల్లిదండ్రులు. దాసు శ్రీరాములు మహాకవి, పండితుడు, వాగ్గేయకారుడు, న్యాయవాదే కాక సంఘసంస్కరణాభిలాషి కూడా. ఆయనకు ఆరుగురు మగబిడ్డల తర్వాతపుట్టిన బిడ్డ శారద. అందరి కంటే చిన్నది కావడంతో బాగా గారాబంగా పెరిగింది. పసివయస్సులోనే సంగీత సాహిత్యాలపట్ల మక్కువ పెంచుకుంది. అది సంగీత, సాహిత్యాలు భోగంవారి విద్యలుగా పరిగణించిన కాలం. కాలానికి ఎదురునిల్చి శ్రీరాములుగారు ఆమెకు సంగీత, సాహిత్యాలు నేర్పించారు. విదుషీమణిని చేసారు. కచ్చేరీలు చేయించారు. కావ్యాలు వ్రాయించారు. ఈ తండ్రీ తనయల చరిత్రను శారదగారు వ్రాసిన నాగ్నజితీ పరియణ కావ్యపీఠికలో విపులంగా కథనం చేసాను. ఔత్సాహికులు వాళ్ల ఉదాత్త చరిత్రను అందులో అరయవచ్చును.

ఈ బాలకవయిత్రి పదవ ఏటనే పద్యసాధన ప్రారంభించింది. 14వ ఏట (క్రీ.శ. 1895) మాధవశతకం వ్రాసింది. 16వ ఏట (1897) నాగ్నజీతిపరిణయ కావ్యం వ్రాసింది. 1888 మే నెలలో వేమూరి రామచంద్రరావుతో ఆమె వివాహం జరిగింది. అత్తగారింట్లో బహుసమస్యల మధ్య ఆమె కోడరికం భారంగా నడిచింది.

అక్కడ ఆమె అభ్యుదయ భావాలకు చుక్కెదురైంది. 1896లో ఆమెకు దుర్గాంబ అన్న పాప పుట్టింది. 1899 డిసెంబరు 26న కొడుకును కన్నది. ఆ ప్రసూతి సమయంలోనే తన 19వ ఏట శాశ్వతంగా కన్ను మూసింది.

లబ్ధప్రతిష్ఠులైన దాసు శ్రీరాములుగారి కూతురి సాహిత్య భవిష్యత్తు పట్ల ఆనాటి సాహిత్యలోకం ఎన్నో నమ్మకాలు పెట్టుకుంది. వాటన్నింటిని వమ్ము చేస్తూ ఆమె అర్ధాంతరంగా కాలం చేసింది. పూర్ణాయుష్కురాలై ఉంటే ఆమె మరో వీరేశలింగమై ఉండేది.

వీరేశలింగం, తండ్రి దాసు శ్రీరాములు గార్ల ప్రభావంతో బాలశారద వ్రాసిన గ్రంథం మాధవ శతకం. ఇందులో స్త్రీ అభ్యుదయం, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విద్యల పట్ల ఆమె పిడికిలి బిగించి చేసిన నినాదాలు ఆమె గతించిన తర్వాత ఒక దశాబ్ద కాలం పాటు ఆంధ్రదేశంలో ప్రతిధ్వనించాయి. నిజానికి 19వ శతాబ్దినాటికి దాదాపు అన్ని దేశాలు స్త్రీకి ఓటు హక్కు తప్ప స్త్రీ సమానత్వం, స్త్రీ హక్కులు సంపాదించు కొన్నాయి. అందుకు పరోక్షకారణమైన ఫ్రెంచి విప్లవానికి మహిళల తరపున మనం కృతజ్ఞతలు చెప్పాలి.

ఫ్రెంచ్ విప్లవం (క్రీ.శ. 1789) కారణంగా భూస్వామ్య, బానిసత్వ వ్యవస్థలు రద్దయ్యాయి. స్వేచ్ఛ, సమానత్వం పునాదులపైన మానవహక్కుల ప్రకటన జరిగింది. కాని అది స్త్రీ వివక్షపట్ల మౌనం వహించింది. పురుషులతో పాటు స్త్రీలకు కూడ సమాన హక్కులు కావాలని ఓలంపిడి గొగస్, మేరి వులస్టన్ క్రాఫ్ట్ వంటి విద్యావంతులైన మహిళలు ఫ్రాన్సు, ఇంగ్లండులలో ఉద్యమాలు చేసారు. తర్వాత కార్ల్‌మార్క్స్ (1864), ఎంగిల్స్ (1884) వంటి మేధావుల ప్రవేశంతో స్త్రీ హక్కులు, విద్య ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. అది భారతదేశంలోకి కూడ ప్రవేశించింది. రాజారామమోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, జ్యోతీరావుపూలే వంటి మహనీయులు ఆ ఉద్యమాన్ని తమతమ ప్రాంతాలలో స్త్రీ సమస్యలకు అన్వయించి పోరాడారు. కవికోకిల సరోజినీనాయుడు వర్ణాంతర వివాహం చేసికోవాలనుకొన్నప్పుడు నాటి కట్టుబాట్లకు భయపడి ఆమె తండ్రి అఘోరనాధ ఛటోపాధ్యాయ కన్యాదానం చేయలేదు. వీరేశలింగం ఆమెను దత్తత తీసుకొని కన్యాదానం చేసారు. ఇటువంటి సంస్కరణలను మొదట్లో దాసుశ్రీరాములు వంటి వారు వ్యతిరేకించినా, తర్వాత అందలి సత్యాన్ని గ్రహించారు. ఆ ఉద్యమంలో

భాగమయ్యారు. బాల్యంలోనే బాలశారద కూడ అందులో భాగమయింది. అక్షరం ద్వారా దాన్ని జగద్వ్యాపితం చేయాలనుకుంది. మాధవశతకం వ్రాసింది. ఇందులో మొత్తం 101 పద్యాలున్నాయి.

మొదటి ఆరు పద్యాల ఇష్టదేతాస్తుతి, చివరి 11 పద్యాల దశావతార స్తుతిని మినహాయిస్తే తక్కిన 84 పద్యాలు స్త్రీ విద్య, అభ్యుదయం గురించే ఆక్రోశిస్తాయి. స్త్రీ అభ్యుదయం గురించి మొత్తం తెలుగు సాహిత్యంలోనే వ్రాయబడ్డ మొట్టమొదటి శతకం మాధవ శతకం (1896). అంతకు (1895)కు ముందు, చంద్రగిరి శేషమ్మ (నీతిశాస్త్రపద్యాలు), కాకరవర్తి బాయమ్మ, నందివాడ నరసమ్మ (వైద్యశాస్త్రవేత్త), అనపర్తి కృష్ణవేణమ్మ (కీర్తనలు) మొదలైన రచయిత్రులున్నారు కాని వాని చదువులన్నీ సతీధర్మప్రకాశిక తరగతిలోనివి. స్త్రీ అభ్యుదయానికి వాళ్ల చదువులు తోకచుక్కలే కాని శారదాంబ వలె వేగుచుక్కలు కావు.[1]

తొలి పద్యంలోనే ఆ చిఋత కవయిత్రి స్త్రీ చైతన్యాన్ని నర్మగర్భంగా స్వామికి విన్నవించుకుంది. చూడండి.

ఉ. **శ్రీరమణీ మనోహర! సుశీల! నిజాశ్రిత కష్టభంజనా!**
**మార సమానదేహ! యనుమానములేక ముదంబుచే నినుం**
**గోరి భజించినందులకుఁ గూరిమి బ్రోవగ రాదె నన్నిలన్**
**సారసనేత్ర! నాదగు విచారములెల్లను దీర్చి మాధవా.** (1వ)

ఇది స్థూల దృష్టికి ప్రార్థనాపద్యం. కాని, ఇందులో – 'నాదగు విచారము లెల్లనుఁ దీర్చి' – అన్నదాంట్లో చాలా అర్థం ఉంది. స్త్రీలు చదువు సంధ్యలు లేక చవటలుగా ఉన్నారు. అదే నా విచారం. వాళ్లను చదివించి, జ్ఞానవంతులను చేసి నా బాధ నివారించమని స్వామికి ఆమె నివేదించుకుంది. ప్రబంధకన్యల

[1] స్త్రీ విద్యావ్యాప్తి కోసం ఆనాడు వీరేశలింగం గారి ప్రభావంతో రాయసం వేంకట శివుడు 'జనానా' – అన్న పత్రిక స్థాపించారు. అందులో స్త్రీ విద్య గురించి శారదాంబ వ్రాసిన పద్యాలు అచ్చయ్యేవి. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారి అక్క బండారు అచ్చమాంబ (1874–1905) స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ వ్రాసిన రచనలు కూడ అందులో అచ్చయ్యేవి. వెయ్యేండ్ల స్త్రీల చరిత్రలను కథనం చేస్తూ ఆమె వ్రాసిన 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అన్న గ్రంథం ఆమె అగాధ పరిశోధనకు అద్దం పడుతుంది. స్త్రీల చరిత్రను అద్భుతంగా ఆవిష్కరించిన ఆ గ్రంథం 3 భాగాలుగా వీరేశలింగం గారి చింతామణి ప్రెస్సులో అచ్చయింది. 1905లో అచ్చమాంబ ప్లేగు వ్యాధికి గురై మరణించింది.

విరహానలంతో సాహిత్యక్షేత్రాన్ని చవిటిపర్రలను చేస్తున్న మహాపండితులున్న కాలంలో ముక్కుపచ్చలారని ఈ 14 ఏండ్ల పాప – స్త్రీ జాతిని చదువుతో సంస్కరించమని కార్చిన ఆ వేడికన్నీటి బిందువు – ఆ చవిటి పర్రను సస్యశ్యామలం చేయడానికి కురిసిన తొలి వర్షబిందువు.

నిజానికి శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి వంటి పండితులు స్త్రీ విద్యను అంగీకరించారు. కాని వాళ్ల సభాప్రవేశాన్ని, అభ్యుదయాన్ని గర్హించారు. వాళ్లు అంగీకరించిన స్త్రీ విద్య అంతా నాల్గుగోడల మధ్య పురాణపఠనానికి, సతీధర్మ ప్రకాశికలను వల్లించడానికే కాని, సృజనాత్మక ఆలోచనలను రేకెత్తించేది కాదు. కాని సీత, చంద్రమతి, దమయంతి వంటి స్త్రీలు చదివిన విద్య – కష్టకాలంలో వివేకంతో తమ వ్యక్తిత్వం తాము కాపాడుకోడానికి, తమ ప్రియుల సాన్నిధ్యాన్ని తిరిగి చేరడానికి ఉపకరించింది. అటువంటి విద్యకావాలని బాలశారద (8వ పద్యం) మాధవుడికి మొరపెట్టుకుంది.

శివుడు భార్యను (గంగను) నెత్తిన పెట్టుకున్నాడు. బ్రహ్మ నాల్కపై నిలుపుకున్నాడు. నీవు గుండెల్లో పెట్టుకున్నావు. మీరంతా భార్యలను ఇంతగా ప్రేమిస్తుంటే ఈ మనుషులేంటి స్వామీ! కూసుముండా అంటూ భార్యలను చిన్నచూపు (9వ పద్యం) చూస్తారు. వాళ్ల బుద్ధులను మార్చు తండ్రీ (10వ పద్యం) – అని నిట్టూర్చింది.

పూర్వకాలంలో స్త్రీలు పెండ్లి తర్వాత కూడ తమ భర్తల దగ్గర చదువుకున్నట్లు తెలుస్తుంది. ఇందుమతీదేవి తన భర్త అజునివద్ద లలిత కళలను అభ్యసించినట్లు, రఘువంశం 'ప్రియశిష్యా లలితే కళావిధౌ' (రఘువంశం 8–67) అని చెబుతుంది. 'మాళవికాగ్నిమిత్ర' కథానాయిక గణదాసుడనే నాట్యాచార్యుని వద్ద సంగీతాభినయాలను నేర్చుకుంటుంది. అటువంటి దేశంలో ఈనాటి మగాళ్లే స్త్రీ విద్యకు అడ్డుపడుతున్నారని (12వ పద్యం) ముక్కున వేలు వేసుకుంది.

చదువు వద్దంటే ఎలా? చదువు మగవాళ్లకు ఎలాగో ఆడవాళ్లకు కూడ అలాగే కదా! స్త్రీలకు చదువంటే ఇష్టం లేకపోతే అది చాలా తప్పు. మొక్కుబడిగా నాల్గక్షరాలు నేర్చుకుని పురాణాలు వల్లెవేస్తే అది చదువు (19వ పద్యం) కాదు. ఆలోచనాత్మకమైన విద్యే విద్య కదా! అలాంటి చదువులు చదివిన భాస్కరాచార్యుని పుత్రిక లీలావతి, భోజుని సతి భానుమతుల చరిత్రను ఇలా ప్రస్తావించింది.

**ఉ. పావన నామ్ని సద్గణిత పద్ధతిఁ దెల్పదె బోటి కాదె లీ**
**లావతి భాస్కరార్యు సుత రామయ కాదె సరస్వతిం గనన్**
**దేవతయయ్యె విద్యలకు దేజము మీఱగ భోజుభార్య వి**
**ద్యావతియైన భానుమతి యారయ నాఁడుది కాదె మాధవా!**

లీలావతి గణితశాస్త్రవేత్త. 'లీలావతీ గణితం' వ్రాసింది. ఆమెదొక చిత్రమైన గాథ. జాతకంలో ఆమెకు వైధవ్యం ఉంది. ఆయుష్మంతుడైన వరుణ్ణి వెతికి తండ్రి బలమైన ముహూర్తంలో లగ్నం నిర్ణయించాడు. ఆ కాలంలో కాలాన్ని వాలుకా యంత్రాలతోను, ఘటికాయంత్రాలతోను నిర్ణయించేవాళ్లు. ఇసుక – సూర్యుని నీడ ఆధారంగా కాలాన్ని నిర్ణయించే వాలుకా యంత్రం కన్నా, ఘటికా యంత్రమే కాలాన్ని ఖచ్చితంగా నిర్ణయిస్తుంది.

ఘటికాయంత్రంలో ఒక లక్కపిడత ఉంటుంది. దానికొక చిన్న బెజ్జం ఉంటుంది. ఆ పిడతలో నీళ్లు పోస్తారు. అందులోంచి ఒక్కొక్క బొట్టు క్రింద పాత్రలో పడుతుంది. అది నిండగానే ఒక గంట అయిందని కాలాన్ని నిర్ణయిస్తారు.

ముహూర్తం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఇంతలో వధువు లీలావతి ఆ లక్క పిడతలోకి తొంగి చూసింది. ఆమె ముక్కెర రత్నం రాలి అందులో పడింది. అది లక్కపిడత రంధ్రాన్ని కొంతమేర మూసివేసింది. ఎవరూ దాన్ని గమనించలేదు. ముహూర్తం దాటిపోయింది. దుర్లగ్నంలో తాళికట్టడం, వరుడు మరణించడం, లీలావతి విధవకావడం వరుసగా జరిగిపోయాయి. ఆమె జీవితం వ్యర్థం కాకూడదని భాస్కరుడామెను గణితశాస్త్ర ప్రవీణగా శిక్షించాడు. ఆమె వ్రాసిన 'లీలావతి గణితం' ఇంగ్లీషు, పర్షియా, ఉర్దూ మొదలైన భాషలలోకి అనూదితమయింది. స్త్రీలావిధంగా తమ జీవితాలను ధన్యం చేసుకోవాలని మన బాలసరస్వతి ప్రబోధించింది.

ఈ పద్యంలోనే మరొక విద్యావతి అయిన భోజుని భార్య భానుమతిని కూడ ప్రస్తావించింది. భానుమతికి సంస్కృత ప్రాకృతాలలో చక్కని వైదుష్యం ఉంది. భోజ కాళిదాసుల మైత్రికి పండితులు అసూయపడ్డారు. వాళ్లను విడదీయడానికి కుయుక్తులు పన్నారు. దాసీచేత లీలావతీ కాళిదాసులకు 'సంబంధం' ఉందని భోజుడు వినేటట్లు చెప్పించారు. అనుమానం పెనుభూతం. ఆ భూతం పట్టి భోజుడు చిదుముడి పడ్డాడు. దొంగజ్వరం నటించాడు. కాళిదాసును, లీలావతిని పిలిపించాడు. లీలావతితో – నేనిప్పుడు పథ్య భోజనం చెయ్యాలి అన్నాడు. ఆమె వెండి పళ్లెంలో

భోజనం తెచ్చింది. పెసరపప్పు వడ్డించింది. రాజు వాళ్లిద్దరినీ ఓరకంట చూసాడు. పరీక్షించాలనుకొన్నాడు. కాళిదాసుతో –

**'ముద్గదాళీ గదవ్యాళీ కవీంద్ర వితుషాం కథం' –**

కవీంద్రా! రోగాల పాలిటి సర్పమైన పెసరపప్పు పొట్టు లేకుండా ఉంది. విశేషమేంటి? – అని అడిగాడు. అప్పుడు కాళిదాసు –

**'అంధో వల్లభ సంయోగే జాతా విగత కంచుకా' –**

అన్నము అనే ప్రియునితో సంగమిస్తున్నప్పుడు రవిక ఎందుకు మహారాజా! అన్నాడు. అక్కడే ఉన్న సాహిత్యధురీణ భానుమతి అందలి శృంగార స్వారస్వాన్ని అర్థం చేసికొంది. భర్తతో తన స్వానుభవం గుర్తుకు వచ్చి నవ్వింది. భోజునికి అనుమానం బలపడింది. కాళిదాసును దేశం నుండి బహిష్కరించాడు. తర్వాత లీలావతి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకునే కథ కొంత ఉంది. ఇదంతా భల్లాలకవి భోజప్రబంధం (అందులో భోజుని భార్య పేరు భానుమతి కాదు లీలావతి) లోని కథ. పదేళ్ల ప్రాయంలోనే ఇలాంటి రసవత్ ప్రబంధాలను అవలోడించి మన శారదాంబ సారస్వతామృత ప్రవాహంలో సుస్నాత కావడం ముచ్చట గొల్పుతుంది.

అతని కంటే ఘనుడు అచ్చంట మల్లన్న – అన్నట్లు మరొక ప్రజ్ఞాధురీణ అయిన పెద్దిభట్టు భార్య పాండిత్యాన్ని కూడ ప్రస్తావించింది.

**ఉ. భాసిలు పెద్ది భట్టుసతి వచ్చిన శిష్యులఁగాంచి వారిలో**
**వాసి గనంగనెంచి మృదువైఖరిఁ దెల్పెఁగదా! "గురోస్తు క**
**ర్ణే సరటః ప్రవిష్ట" యని నేరుపు మీఱఁగ నట్లు జెప్పఁగా**
**నా సతి మంచి విద్య దనరాగ నేర్చెనె కాదె మాధవా!**

పెద్దిభట్టు (ఈయనే మల్లినాథసూరి అని కొందరు, కాదు అతని సోదరుడని కొందరు) భార్య సాహిత్య విద్యాసరఃపరిపూత. ఒకసారి పెద్ద భట్టు శిష్యులను పరీక్షించాలనుకుంది. 'గురోస్తు కర్ణే సరటః ప్రవిష్టః' – గురువుగారి చెవిలో సరటం (తొండ) దూరింది – అన్న సమస్యనిచ్చింది. వాళ్లు తెల్లమొహం వేసారు. దాన్ని ఆమె నేర్పుగా పూరించింది. ఆమెను చూచి నేర్చుకోండి – అని మన విదుషీకుమారి నొక్కివక్కాణించింది. ఇందలి ఐతిహ్యం నాబుద్ధికి అందలేదు. పండితమిత్రులతో

ప్రస్తావించాను. విఫలమనోరథుడినయ్యాను. ఇది ఈ బాలిక అగాధసారస్వత అధ్యయనానికి ప్రబల నిదర్శనం.

కానీ పెద్దిభట్టు భార్య అపండిత అనీ, తన అందాన్ని వర్ణించమని భర్తను అడిగిందనీ, అందుకాయన – 'మేరు మందర సమాన మధ్యమా / తింత్రిణీదళ విశాలలోచనా / అర్కశుష్క ఫలకోమల స్తనీ / పెద్ది భట్ట గృహిణీ విరాజతే (మేరు, మందర పర్వతాలతో సమానమైన నడుము, చింతాకుల వలె వెడల్పైన కళ్లు, ఎండిన జిల్లేడు పండ్ల వంటి సుందరమైన చన్నులు కల్గి పెద్దిభట్టు భార్య ప్రకాశిస్తుంది) అని గేలి చేసాడని చాటు శ్లోకాలలో ఒక ఐతిహ్యం ఉంది. కాని మన శారదమ్మ తల్లి ఆమెకా కళంకాన్ని తొలగించి ఆమె ఉపజ్ఞామహిత అని నిరూపించింది.

ఆశ్చర్యం కల్గించే ఇంకొక గాథ చెప్తాను. మహాకవి అల్లసాని పెద్దన మనుచరిత్ర వ్రాస్తూ – ఒకనాడు గర్భిణీ స్త్రీని ఎలా వర్ణించాలా అని ఆలోచిస్తున్నారు. అతని కుమార్తె దాన్ని ఎంత నేర్పుగా వర్ణించిందో గదా! అని శారదాంబ (44వ పద్యం) ఆశ్చర్యపోయింది. కానీ నేను విన్నది గర్భిణీ సురత వర్ణన గురించి. ఆంధ్ర సాహిత్యంలోనే మొదట గర్భిణీ సురత వర్ణన చేసిన కవి పెద్దన. దాన్నెలా వ్రాయాలా అని ఆలోచిస్తుంటే అతని కుమార్తె –

**సీ. మనసు కక్కుఱితి మెల్లన లేచి చేతులఁ**
**గాంతుని జబ్బుగాఁ గౌఁగిలించు.** (మను 3–123)

– అన్న పద్యం చెప్పిందని గాథ. ఈ పద్యం ప్రక్షిప్తమన్నారు కొందరు. దీని తర్వాత వరూధినిని మాయాప్రవరుడు విడిచి పెడతాడు. అందువలన శిథిలపద బంధంతో కవి ఈ పద్యం వ్రాసాడు. అంటే వాళ్ల బంధం శిథిలమవుతుందని చెప్పడం. అందునా గర్భిణీ సురతంలో అతృప్తి. దాంతో అతనికి ఆమె అవసరం తీరిందని. అందువలన శిల్పదృష్టితో చెప్పిన ఈ పద్యాన్ని ప్రక్షిప్తమనరాదు. ఈ పద్యం పెద్దనగారి కూతురిదన్నమాట నిజమైతే ఆమె పేరు, రచనలు దొరక్కపోవడం నిజంగా దురదృష్టం. ఆమెను గుర్తు చేసిన శారదమ్మను అభినందించాలి.

ఈ శతకంలో ఈ కవివరేణ్య – శాస్త్రాలలో ఉన్న విషయాలను కూడా త్రవ్వి పోసింది. స్మృతులలో – వంశం, శీలం, బలం, విద్య – ఈనాల్గింటిలో తనకు ఈడైన వానిని వరించమని బ్రహ్మ స్త్రీకి చెప్పాడు. అతివలది మరచిపోరాదని (25ప.)

హితువు పలికింది. పిల్లలకు రోగాలు రొప్పులు వస్తుంటాయి. వైద్య గ్రంథాలలో వాటికి చికిత్సా విధానం ఉంటుంది. అంగనలు చదువుకొంటే ఆ రహస్యాలు తెలిసికొని ఎందుకు ప్రయోజనం పొందకూడదని (26వ పద్యం) ప్రశ్నించింది.

మగవాడి దేహంలో స్త్రీ సగభాగమంటారు కదా! అందులో పురుషుడి అర్థ దేహం చదువుకుని, స్త్రీ అర్థదేహం అవిద్యతో ఉంటే – అది ఆ దేహానికి పక్షవాతమే కదా! (28వ ప) అని మెత్త మెత్తగా దెప్పింది. బోగపు సానుల పాటలు వింటూ ఇది మేమెక్కడా వినలేదే! ఎంత బాగున్నాయి అని వాళ్లను కీర్తించేకంటే ఇల్లాండ్రు కూడ సంగీతం నేర్చుకుంటే మేలు కదా! (29వ పద్యం) ముదితలు కూడ నాట్యం నేర్చుకోవాలి. నాడు బృహన్నల దగ్గర ఉత్తర కుమార్తె నాట్యం నేర్చుకోలేదా! ఆమె పతివ్రత కాదా (32వ పద్యం) అని సంగీత సాహిత్యాలు విరిబోండ్ల కవనరమని, అవి బోగపు విద్యలు కావని హితవు పలికింది.

స్త్రీలు శ్రుతులు వినకూడదని అంటారు. మనకు ధర్మాలు నిర్ణయించిన మనువు కూతురు దేవహూతి తన కొడుకు కపిలుని వద్ద సాంఖ్యశాస్త్రాన్ని నేర్చుకోలేదా (41ప). కృష్ణుని కీర్తించి మీరాబాయి ఉత్తర భారతంలో ప్రఖ్యాత కాలేదా (43 ప). ఆకాశంలోని నక్షత్రాలెన్ని అని భోజుడు వరాహ మిహిరుని ప్రశ్నిస్తే, అతని కోడలు భాన ఒక గంపనిండా ఇసుక తెప్పించి – ఇన్ని అని గడుసుగా సమాధానం చెప్పిన మేథావిని మన స్త్రీ అని మర్చిపోతే (45ప) ఎలా? అని నిలదీసింది.

మహిళలు తప్పనిసరిగా – చిత్రలేఖనం, బాలచికిత్స, చరిత్ర, భూగోళం, దేశభాష, గణితవిద్యలు నేర్చుకోవాలని (57ప) ప్రబోధించింది. వింజమూరి తిమ్మక్క 'డోలాయాత్ర' అన్న ద్విపద గ్రంథం వ్రాసింది కదా! ఆమె మనకు మార్గదర్శి కాదా! (65ప). ఎప్పుడూ మూగనోము, దయ కుంకుమ వంటి నోములతో పొద్దుపుచ్చకపోతే కాస్త చదువుకుంటే మేలు గదా (66ప). అంటూ వ్రతాలను, నోములను తృణీకరించింది (66ప). ఆడవాళ్లు చదువుకొని ఏం చేయాలి? ఉళ్లేలాలనా, ఉద్యోగాలు చేయాలనా అని అంటారేంటి? విజ్ఞానాన్ని పెంచుకోవడం కోసం చదవాలంటున్నాను(71ప) అని ఎలుగెత్తి చాటింది. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు కాలదోషం పట్టని సమాధానాల ఖజానా ఈ మాధవశతకం.

చదువుకోకపోవడం వల్లనే మన ఆడాళ్లు ఇంత మర్యాదగా ఒదిగి ఉంటారంటా రేంట్రా బాబూ! అది మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పదనం అని తెలుసుకోండ్రా

నాయనా! అని (75ప) ఉద్ఘోషించింది. స్త్రీలకు ఐదుగురు భర్తలున్న ద్రౌపది వంటి పేర్లు పెడితే కొందరివేం పేర్లు? బోగమోళ్ల పేర్లంటారే. అయితే వేలాది మంది పెండ్లాలున్న కృష్ణుని పేరు మీకెలా పవిత్రమైందయ్యా చెప్పండి (81ప). అని పురుష సమాజంపై, వయస్సుకు మించిన మేధతో ఈ బాల కమ్యూనిస్టు నిశితమైన ప్రశ్నలు సంధించింది. ఆడవాళ్ల కెందుకీ ఘోషా పద్ధతి. పల్లకీలు, గాడీలు ఎక్కినా ఊపిరాడకుండా తలుపులు మూస్తారు. బుర్ఖాలు వేస్తారు. మాకు ఊపిరాడవద్దా! ఇంత అనాగరికమా (83ప.) అంటూ నాటి సంకుచిత సమాజంపై శిలీముఖాలు సంధించింది.

పూర్వం అమ్మాయిలకు యుక్త వయస్సు వచ్చాక స్వయంవరం చాటించే వాళ్లు. ఆమె వరించిన వరునికిచ్చి పెండ్లి చేసేవాళ్లు. కాని ఇప్పుడేంటి అమ్మాయికి తెలియకుండానే తల్లిదండ్రులు తమకు నచ్చిన వాళ్లకిచ్చి పెండ్లి చేస్తున్నారు (86ప). మరీ అన్యాయంగా డబ్బుకాశపడి డెబ్బై, ఎనభై ఏండ్ల ముసలివాండ్ర కిచ్చి ముక్కుపచ్చలారని పాపలకు పెండ్లిచేసి వాళ్ల గొంతు కోస్తున్నారంటూ (87ప), గురజాడ కంటే ముందే ఆ దురాచారాన్ని ఖండించింది.

ఇదీ పద్నాలుగేండ్ల చిన్నారి వయస్సుకు మించిన ఆవేశంతో నాటి ఇరుకైన సమాజంపై అక్షరాయుధంతో దాడిచేసిన విధానం నాటి విద్యావంతులపై ఇది చాలా ప్రభావం చూపింది. అందువల్లనే ఈ బాల కవయిత్రిని నేను తొలి స్త్రీ వాద రచయిత్రిగా ఘంటాపథంగా చాటుతున్నాను.

స్త్రీ స్వేచ్ఛను ఉద్ఘోషించిన ఈ పద్యగ్రంథంలో కొన్నిచోట్ల లక్షణికాంశాలు కూడా స్వేచ్ఛనే కోరుకున్నాయి. అప్రశస్తమైన వ–మ యతి, బ–మ యతి, క్వార్థ కేకారాలు వంటివి అక్కడక్కడా తగులుతాయి. అవి అంత గణింపదగినవి కాదు కాని ఒకచోట గుడిసెవేటులు (74ప) అన్న పదం ప్రయోగించింది. దాని అసలు రూపం గుడి చేటి. అంటే వేశ్య అని అర్థం. వ్యావహారికంలో గుడిచేటి ముండ అనడం కూడ కద్దు. అలా అనలేక ఈ పాప గుడిసె వేటు – అని తప్పుకుంది. తరచి చూస్తే ఇలాంటివి ఇంకా కొన్ని తగులుతాయి. కానీ ఇప్పటికే పీఠిక పెద్దదయింది.

నిజానికి ఈ శతకానికి ఇంత పీఠిక అక్కర్లేదు. కాని ఈ బాలికా మూర్ధన్య వయస్సుకు మించిన చదువులు చదవడంతో పెద్దపెద్ద పండితులే ఎరుగని ఎన్నెన్నో

గాథలను త్రవ్వింది. దాంతో చాలా భేతాళాలు బయటపడ్డాయి. వాటన్నిటిని తడమకపోతే ఆ బాల శ్రమంతా వృథా అవుతుంది కదా అని వివరించాను. ఒండురెండు చోట్ల నా సందేహాలను తీర్చిన విద్యామిత్రులు ప్రవచన పాంచజన్య బిరుదాంకితులు బ్రహ్మశ్రీ వడ్డేపల్లి శ్రీనివాసరావుగారికి నా కృతజ్ఞతలు.

దాదాపు 125 సం॥లు క్రితం ఈ చిన్నారి క్రాంతదర్శిని కాంక్షించిన స్వేచ్ఛా జగత్తు ఇప్పటికీ పూర్తిగా సిద్ధించలేదు. ఇంకా మహిళల పట్ల వివక్ష, అవిద్య కొనసాగుతూనే ఉంది. వీరేశలింగం పంతులు గారిని తమ ఆధ్యాత్మిక గురువుగా గుండెల్లో గుడికట్టుకున్న చలంగారు – 'స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయమం ఇవ్వాలి. స్త్రీకి హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి. స్త్రీకి మెదడు ఉంది. దానిని ఆలోచించనివ్వాలి' – అన్నమాటలు సాకారమైనప్పుడే మన శారదమ్మ కలలుగన్న మహితవిద్యాసముదీర్ణమైన మహిళా చైతన్యం అజస్ర సహస్ర నిజప్రభలతో ఉదాత్త సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. అస్తు!

**స్త్రియోహి నామ ఖల్వేతా నిసర్గా దేవపండితాః**
**పురుషాణాం తు పాండిత్యం శాస్త్రైరేవో పదిశ్యతే ॥**

– మృచ్ఛకటికం 4 అం. 19 శ్లో.

(పురుషులకు శాస్త్రం చదువుకుంటే పాండిత్యం వస్తుంది. కాని స్త్రీలకు మాత్రం అది సహజంగానే ఉంటుంది).

వేములపాడు — 'ప్రసన్నకవి'
విళంబి భాద్రపద బ॥ పాడ్యమి — **ఉన్నం జ్యోతివాసు**
26-9-2018

క. కులమును గుణమును రూపును
గలిగిన బాలికకు విద్యగలిగినయేనిన్
తలఁపఁగఁ బసిఁడికి వాసన
కలిమియుఁ జెఱకునకుఁ బండుఁ గలుగుటగాదే!

– మల్హణచరిత్ర 1:73

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | నివేదన | 3 |
| 2. | ముందుమాట – ఆచార్య కాత్యాయనీ విద్మహే | 8 |
| 2. | సమీక్ష – ఆచార్య బేతవోలు రామబ్రహ్మం | 16 |
| 3. | ప్రణిధి – 'ప్రసన్నకవి' ఉన్నం జ్యోతివాసు | 18 |
| 4. | మాధవశతకము | 33 |
| 5. | కీర్తనలు | 50 |
| 6. | అనుబంధములు | |
| | శకటబంధగర్భితోత్పలమాల | 51 |
| | రేఖాచిత్రమాలిక | 52 |
| | పరిష్కర్త పరిచయము | 57 |
| | కలావతి మాస పత్రిక (1901) విషయసూచిక పుటలు | 58 |
| | మహాకవి దాసు శ్రీరాములు గారి వంశవృక్షము | 60 |
| | మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి ప్రచురణలు | 61 |

# మాధవశతకము

శ్రీ శుభమస్తు

# మాధవశతకము

## (స్త్రీజనక్షేమార్థక భగవత్ప్రార్థన పద్యములు)

ఉ. శ్రీరమణీ మనోహర! సుశీల! నిజాశ్రిత కష్టభంజనా
మార సమాన దేహ! యనుమానములేక ముదంబుచే నినుం
గోరి భజించినందులకుఁ గూరిమి బ్రోవఁగ రాదె నన్నిలన్
సారసనేత్ర! నాదగు విచారము లెల్లను దీర్చి మాధవా! 1

శా. శ్రీరామా! ననుఁ బ్రోవవేర కరుణన్ శీఘ్రుంబుగా నీశ్వరా!
యేరా నీదగు నామకీర్తనము కాదేపాపు మాపాపముల్
కోరాడంగ నటంచు మ్రొక్కితిని సద్గోత్రోద్భవా! సుందరా
కారా! రాక్షస మర్దనా! సకలలోక ప్రాపకా! మాధవా! 2

శా. రామా! కేశవ! బ్రోవవేమిర రమారామా! మనోహారకా!
భౌమప్రాభవ! శౌరి! శంకరనుతా! బాలేందు తుల్యాలికా!
నామాటల్ చెవిఁబెట్ట వేఁడెద దయన్ నారాయణా! వామనా!
నీమాయల్ తెలియంగలేరిల జనుల్ నిక్కంబుగా మాధవా! 3

ఉ. తాటక సంహరించి మఱి తాపసి యాగము గాచినావుగా
కోటిరవిప్రభా! సకల కోవిద సన్నుతిఁ గన్న యట్టి నీ
సాటి జగాన గాన ననుఁ జయ్యన గావుము నారసింహ! యీ
మాటలిఁకేల నీవ గతి మాకిల వేఱిక లేరు మాధవా! 4

ఉ. ద్రౌపదిఁ గావలేదె భవతాపనివారక! దైత్యసంహరా!
నాపయి జాలిలేదు కద నాతిగఁ జేయవె ఱాతి నోహరీ!
గోపవధూప్రియా! దురిత కుంజర సింహ! ప్రపంచపోషకా!
నీపదయుగ్మముల్ గొలిచి నేనిఁక ధన్యతఁ గంటి మాధవా! 5

ఉ. నందసుతా! రమాధవ! వినందగు నామొఱఁ బ్రేమతోడ గో
విందా! దయానిధీ! నృహరి! విష్ణు! ముకుంద! సమస్తరక్షకా!
సుందరహైమచేల! మధుసూదన! రమ్యగుణా! త్రివిక్రమా!
పొందుగ బుద్ధిశాలినిగఁ బ్రోవుము శ్రీధర! శూరమాధవా! 6

ఉ. నిన్ను మదిం దలంచి యిటు నిచ్చలు వేఁడు టదేలయన్న స
త్సన్నుత! స్త్రీల దుస్థితిని సద్విదితంబుగ బాపి యిభ్భువిన్
బన్నుగ సద్బుధుల్ తగిన పట్టున విద్యను ముద్దరాండ్రకున్
గ్రన్నన నేరిపించి మరి జ్ఞానము బుట్టగఁ జేయు మాధవా! 7

చ. మునుపటి వార లెల్ల తమ ముద్దియలం జదివించ లేదొకో
వినయ పతివ్రతాత్వ సువివేకములం జరియించినట్టి యా
జనకజఁ జూడరే మఱియుఁ జంద్రమతిం గనరే యిఁకెందఱో
యనుపమ బుద్ధిఁ గీర్తిలత లందిరి విద్యల వల్ల మాధవా! 8

చ. వినఁగ మహేశుఁ డెప్పుడును వీడక గంగ శిరంబునందు నుం
చెనుగద బ్రహ్మ తాను దన జిహ్వను బెట్టెనుగా సరస్వతిన్
అనవరతంబు నీ హృదయ మందున నిల్పితి నీదు కోమలిన్
గననది యేలకో జనులు కారల వైతురు స్త్రీల మాధవా! 9

ఉ. నీరజ నేత్ర! నామనవి నెమ్మది తోడుత నాలకించి నా
కోరిక యట్ల చేడియలఁ గూరిమిఁ గాచియు వారి దుస్థితిన్
సారెకు బాపుమా యిలను జక్కని మార్గములం జరించు నా
చారము గల్గునట్టులుగ సత్పురుషుల్ పనిపూన మాధవా! 10

చ. మురహర! యిట్లు సద్విషయముల్ తగఁ జేయఁగఁ గోరకుండి యీ
సరణిని విద్యనేర్చి గుణసంపద లెల్లను గల్గియున్న యీ
సరసులె యూరకుండిరి విచార మదేమియు లేక యిట్టులన్
మరి యెవరందురో భువిని మానక పూనికసేయ మాధవా! 11

చ. పురుషు లదేలకో యిపుడు పూర్వపు స్త్రీల బలెన్ స్వకీయలౌ
తరుణుల విద్యనేర్పి నిరతంబును వారికి మంచిబుద్ధులన్
గరపక వారి దుస్థితికిఁ గారణమైనను జూడకుండగా
సరగున వారి దుర్గతిని జక్కగఁ దీర్ప వదేమి మాధవా! 12

చ. పలుమరుఁజెప్ప నేటికిటు భామలయందలి పక్షపాతమున్
దెలియక యుండిరా యితర దేశములంగల స్త్రీలబోలె నీ
లలనలఁ గూడ జ్ఞానవతులం దగజేసియు వారి లోపముల్
దొలగఁగఁ జేయ వేఁటెవరు తోయజనాభ! దయాళు! మాధవా! 13

చ. సుదతులు విద్యలేమి నిటు సోమరు లౌటను జూచు చుండియున్
మదినది తోఁచదే మునుపు మన్నన గొన్నది 'మొల్ల' యంచు నా
మదవతి సచ్చరిత్రమును మానక యెంచినఁ జాలుచేడియల్
సదమలచిత్తలౌటకిల సందియ మేమియు లేదు మాధవా! 14

చ. చిన్నతనంబు నుండియును చేడియలం జదివింప కుండిరా
పన్నశరణ్య! పెద్దలిట బాగుగ శ్రద్ధ వహింపకున్నచోఁ
దిన్నగఁ గందురే తెలివి తేటల నెంతయు బంధుమిత్రులన్
బన్నుగ సత్కరించి పతిభక్తి వివేకము గల్గి మాధవా! 15

చ. సనక సనందనాది మునిసన్నుత! యన్ని విధంబులన్ మమున్
జెనటుల జేయుచుండి గుణశీలలగా నొగి బాగుపర్చుకుం
డిన తమగార్హ్య కృత్యములు నేటుగ దిద్దుకొనంగఁ జాలరో
యనఘ! వధూజనార్థమయి యార్యుల వేఁడెద నయ్య మాధవా! 16

చ. చదివినఁ దప్పిదం బనుచు సద్విదు లెన్నడుఁ జెప్పఁ బోరుగా
ముదితలు విద్య నేర్చి కడు మోదము నొందగఁ గోరు నట్టి వా
రదనున నిండ్లలోఁ గలఁత లాత్మవినాశన హేతువంచు నీ
మొదలగు నిక్కటుల్ దెలిసి మూఢత నెట్టుదురయ్య! మాధవా! 17

చ. పుడమిని జెన్నుమీఱ విరిబోఁడులు విద్యల నభ్యసించుటల్
నడుమను మ్లేచ్ఛ రాజ్యమున నాశనమొందె నదేలకో జనుల్
పడతులఁ జాలిమాలి కడుఁ బాములఁ బెట్టిరి యింకనైన నా
చెడునడతల్ తొలంగునటు చేయుదుగాత కృపాళు! మాధవా! 18

చ. వలదనుటెట్లు విద్య మగవారల కెట్టుల నట్టులేకదా
పొలతులు విద్యయంద రుచి పూనక యుండుట తప్పిదంబుగా
లలనలు నాలుగక్షరములం జదువంగనె విద్యకాదుగా
తెలివి సమమ్ము పూనఁగను స్త్రీపురుషల్ధరయందు మాధవా! 19

చ. విననిఁక స్త్రీల దుర్దశలు వెన్కకుఁ బట్టుటఁ దెల్పుచుండె నం
గనలకు విద్యనేర్పుటకు గ్రైస్తవముఖ్యులు పాఠశాల లిం
పొనరగఁజేసి రచ్చుటచ టొప్పుగఁ బూర్వపు స్త్రీలవంటి భా
మినిఁ గలికంబు లోనికిని మేదినిఁ గానగదయ్య మాధవా! 20

ఉ. భాసిలు పెద్దిభట్టుసతి వచ్చిన శిష్యులఁ గాంచి వారిలో
వాసి గనంగ నెంచి మృదువైఖరిఁ దెల్పెఁగదా "గురోస్తు క
ర్ణేసరటః ప్రవిష్ట"యని నేరుపు మీరగ నట్లు జెప్పఁగా
నాసతి మంచివిద్య దనరారఁగ నేర్చెనె కాదె మాధవా! 21

ఉ. పావన నామ్ని సద్గణిత పద్ధతిఁ దెల్పదె బోటికాదె లీ
లావతి భాస్కరార్యు సుతరామయ కాదె సరస్వతింగనన్
దేవతయయ్యె విద్యలకు దేజము మీఱగ భోజుభార్య వి
ద్యావతియైన భానుమతి యారయ నాఁడుది కాదె మాధవా! 22

ఉ. బిడ్డలఁ గొన్ని వర్షములు పెంచుట వారిని మంచి త్రోవలన్
దొడ్డగఁ జెప్పఁదల్లి పరమోత్తమయైనన కాని లేనిచో
నెడ్డెది యైన బిడ్డలకు నెట్లు లభించును దొడ్డ భావముల్
సడ్డ యొనర్పకే చదువఁ జానలఁ బూనిక సేయు మాధవా! 23

ఉ. కార్యములందు మంత్రివలెఁ గాంతల నుండగఁ జెప్పుచున్న యా
యార్యుల మాటలెల్ల మనమాఱడిపుచ్చుఁగ నిచ్చలేనిచో
ధైర్యము పూని విద్య ప్రమదామణి నేరక మంత్రి యెట్లగున్
శౌర్యధురీణ కాన మతిశాలినిఁ గామిని సేయు మాధవా! 24

చ. కులమును శీలముం బలము గూడిన విద్యయు నాలుగింట నే
వలఁతి సమానుఁడో తనకు వానిని బెండిలి చేసికొమ్మటం
చలరఁగఁ జెప్పడే స్మృతుల నా నలుమోముల వేల్పుబిడ్డఁడా
బలుకుల వీటిబుచ్చఁగను బాడియె పెద్దలకెల్ల మాధవా! 25

ఉ. బాలురకెట్టులో నొడలు బాగుగ లేని తఱిన్ స్వయమ్ముగా
మాలిమిచేసి వారి దగుమందుల రోగవిహీను లౌనటుల్
చాలగఁజేయ వైద్యములు శాస్త్రము లందున నుండుఁ గావునన్
స్త్రీలకు విద్యనేర్పినను జేకురు సౌఖ్యము లెల్ల మాధవా! 26

చ. పడఁతులు విద్య నేర్చినను భర్తలకెంత సహాయలౌదు రె
య్యెడలనునైనఁ బ్రాణవిభు లిండ్లకు వచ్చెడి వేళవారి వెం
బడిఁబడి లెక్కఁ జెప్పుమని బాధలు పెట్టగ బాడికాదు సూ!
బడలిక తోడనుండు మగవారి మనంబులు నొచ్చు మాధవా! 27

చ. వనజముఖుల్ దలంప మగవారల కర్ధశరీర మంద్రు పెం
పొనరఁగ నర్ధమాత్రమున నుండిన శక్తియ పక్షవాతమై
తనరునుగానఁ దక్కిన తదర్థము గూడను విద్యనేర్చినన్
గనఁగ నదెంత సుందరముగాఁ గనుపట్టుచునుండు మాధవా! 28

ఉ. పొందుగఁ బెద్ద లందఱును బోగపు సానుల పాటవించు మే
మెందున నిట్టిపాట వినవే వినలేదని వారి కీర్తులన్
పొందుగఁ జేయుకంటె గృహిణుల్ తగుగానము నభ్యసించి యా
నంద మొసంగఁగా గణన నందఁగఁ జేయఁగరాదె మాధవా! 29

చ. లలనలు సత్ప్రవర్తనములం జరియింపఁగ దెల్పి కారణం
బలరఁగ దానిగోరినను బాగుగ విద్యల నభ్యసింపఁగా
వలెగద కాన విద్య మగవారలు మాత్రమెకాక యాఁడువా
రలును సమస్తభంగులను రంజిలనేర్తురు గాత మాధవా! 30

మ. ముదితల్ విద్యల నభ్యసించుటకు నామోదింప రీసుల్మదిన్
బొదలన్ మూఢత నొంద మంచిదనుచున్ బోధింతురే కొందఱ
య్యదియే మంచిదటంచు నెంచినను వారద్దానిఁ బెంపొంద జే
యదగుం గావున మూగలం బరిణియంబౌ టొప్పుగా మాధవా! 31

చ. అరమరలేక నిచ్చలు బృహన్నల యొద్దను నాట్యశాస్త్రమున్
విరటుని కూఁతు దాఁ గరచి విస్తృతకీర్తి వహింపలేదె యు
త్తర కడు యోగ్యురాలని సదా పొగడం బడలేదె చూడ నా
పరమపతివ్రతామణి శుభాంగు బరీక్షితుఁ గాంచె మాధవా! 32

ఉ. వేయునిఁకేల స్త్రీలు కడువేడుక రోఁకటి పాటలందు రా
మాయణ భారతాది కథలందుచుఁ బాడుటకంటె నెంతయుం
శ్రేయము మీఱ గ్రంథ పరిశీలన చేతనె వాని యర్థముల్
జ్ఞేయములౌనటుల్ చదువగిట్టదె తప్పులులేక మాధవా! 33

ఉ. ఇంతులు ప్రొద్దుపోక పొరుగిండ్లను దిన్నెలగూరుచుండి యా
వంతయు నేరకుండి ననువాదము జేయుచునుంద్రు శుష్క వే
దాంత విమర్శ లెప్పుడు నదట్టుల గాకను దీరికైనచోఁ
గాంతలు చక్కగాఁ జదివి గ్రాహ్యము సేయుట మేలు మాధవా! 34

చ. పొలఁతుల నెల్ల సద్విషయముల్ దగ నేర్చిన వారిఁ జేయ గా
వలెననువారు నోటఁ దమవారల కెల్లను జెప్పుచుండి రం
జిలగను నొజ్జలొద్ద దమ స్త్రీలకు నేర్చిన యక్షరాది సం
జ్ఞల మరి తప్పిదంబనుట కాదె కనంగను వెట్టి మాధవా! 35

చ. గొల్లది చల్లవానికిడఁ గోడల గీతలు గీసి లెక్కలం
దెల్లము సేయుఁ జాకలిది తెచ్చిన బట్టలు వ్రేచు బట్టలన్
బల్లవపాణి త్రాడునకు బాగుగ వైచును విప్పు ముళ్ళఁ దా
సల్లలితంబుగాఁ జదువఁ జాలని చిన్నియ లేమి మాధవా! 36

చ. ఇతరులు విన్నచోఁ దమకు నిక్కటు లెన్నియొ సంభవించు సం
గతుల విదేశమందలి స్వకాంతులకుం దెలుపంగ గోరుచో
నతివలు వారు వీరని రహస్యముగా బ్రతిమాలకుండనే
జతురతదారె వ్రాయఁదగు జక్కఁగ విద్యగడింప మాధవా! 37

చ. అలసట జెంది యుండ్రు వ్యవహార భరంబున దేశవార్తలం
దెలిపెడి పత్రికల్ చదువ దీరిక యుండదు కాన నట్టిచో
నలరఁగ భార్య నాథుని మనంబున వేడుక బుట్టునట్టుగా
నెలకొని వాని దాఁ జదువ నేర్చిన ముచ్చట కాదె మాధవా! 38

చ. ముగుదలు దాల్చు నీ రవణముల్ రవణమ్ములు కావు చూడ నిం
పగు సుపతివ్రతాత్వమును భాసిలు సొమ్మును దాల్పఁగా వలెన్
తగునటు గాని దెల్ల దలఁదాపిన అవ్వలఁబోలె విద్యలన్
సొగసుగ నేర్చినట్టయిన శోభ దలిర్చును గాదె మాధవా! 39

ఉ. రాజిల సత్యభామకును ద్రౌపది నీతులఁ జెప్పినట్టులం
దేజముతో బురాణములు తెల్పుచు నున్నవి సుమ్ము శాస్త్రముల్
తా జదువంగ నేర్చిన కతంబుననే కద లోకు లందఱౌ
నా జలజాక్షి కావలె గదాయని పేర్కొననొప్పె మాధవా! 40

చ. మనలకు ధర్మశాస్త్రములు మానుగఁ దెల్పిన భవ్యరూపుఁడౌ
మనువుకుమార్తె భద్రగుణ మానిత మానిని దేవహూతి దా
మునుఁ దన పుత్రుడున్ సుజన పూజితుఁడౌ కపిలాఖ్యు నొద్దనే
వినెగద సాంఖ్యశాస్త్రమును వీనుల కింపు లొసంగ మాధవా! 41

చ. పరఁగఁగ మొన్న మొన్న తనభక్తిని దెల్లము సేయునట్లుగా
తిరుపతి వేంకటేశుపయిఁ దీరుగఁ దా తరిగొండ వేంగమాం
బ రహి రచించె గ్రంథములు బండితులెల్ల భళీభళీ! యనన్
కరచెను గాన విద్యనలకాంత యశంబును బొందె మాధవా! 42

మ. రచియించెన్గద భక్తి యుక్తముగ మీరాబాయి శ్రీకృష్ణుపై
రచనల్ బెక్కులు కీర్తనల్ భువి మహారాజేంద్రు నిల్లాలునై
యచలంబైన మనంబుతోడుతను వింధ్యాద్ర్యుత్తరప్రాంత భూ
మి చనన్ బేర్కొను చుందు రిప్పటికి నామీరాంబికన్ మాధవా! 43

చ. విననిది యెంత వారలకు వింతను బుట్టగఁ జేయుచుండెఁ బె
ద్దన యొక నాఁడొగిఁన్మను కథన్ రచియింపుచు నుండ నందునన్
దనరఁగ గర్భిణిం బొగడఁ దా మది యోజన సేయుచుండ నే
ర్పున దనపుత్రి దానిగని పూర్తి యొనర్చెఁ గదయ్య మాధవా! 44

ఉ. గాఢములైన చుక్కల దగన్ గణియింపు మటంచు భోజుఁ డా
రూఢిగ దా వరాహమిహిరుం బిలిపించుక జెప్ప నాతఁడున్
మూఢతసూప 'భాన'యను ముద్దియ యాతని కోడలెంతయున్
బ్రౌఢత తోడఁ జెప్పెను నృపాలుఁడు సంతసమొంద మాధవా! 45

చ. కలియుగమందు వేదములు కాంతలు శూద్రులు నేరఁగూడ దం
దులకునె భారతంబు దయతో రచియించితి నంచువ్యాసుఁడే
తెలుపుచునుండె గాన సొరిదిం బెర పొత్తము లెల్ల కామినుల్
చెలగఁగ నేర్వ వచ్చునని చెప్పిన నమ్మరదేల మాధవా! 46

చ. చదువనివార లాచదువు చాలని వారి వివాహమైనచో
నదిసరి యౌనుగా జదివినట్టి వివేకులు జ్ఞానశూన్యయౌ
మదవతిఁ బెండ్లియాడ నొకబండికి గుఱ్ఱము దున్నఁ గట్టగా
నొదవిన యెట్టులుండు నటులొప్పుచు నుండును గాదె మాధవా! 47

చ. చతురత వ్రాసె జిత్రపటజాలములన్ మును జిత్రరేఖ యం
చితముగ నెట్టి విద్యగఱచెన్ గన నట్టులు నేర్పు మీఱ వ్రా
యు తరుణు లున్నచో నదియు నుత్తమ పద్ధతి కాన భూమియం
దతివలు నట్లు నేర నిఁకనైనను జేయఁగదయ్య! మాధవా! 48

ఉ. బాగుగ విద్య నేరిచిన వారికి శక్యముగాని కావ్యమే
లాగున నేర్చిరో యువిదలైనను జ్ఞానవిహీనలౌటచే
నాగరితల్ మదిన్ వెదుకనక్కర లేకయె యెన్ని తిట్టులన్
వేగమె వేగమే నుడివివేతు రిఁకేమని చెప్ప మాధవా! 49

ఉ ఎచ్చట నాఁడువార లెపుడెంతయు గౌరవ మందు చుందురో
యచ్చట దేవతల్నిలుతురంచు నదెచ్చట బొందరట్టిచో
హెచ్చుగ జేయునట్టి క్రియలెల్లను నిష్ఫలమౌనటంచు దా
ముచ్చట జెప్పడే మనువు పొందుట దాని నదెట్లొ మాధవా! 50

చ. ముదమునఁ దోకశృంగములు మూఁడును లేని పసుల్తలంపగా
చదువనివార లందఱని చక్కగఁ బల్కుదు రెట్టి చిత్ర మ
య్యదనున గడ్డి నేల తినరన్నను వీరలె గడ్డి దిన్నచో
కొదువమృగంబు లన్నిటికిఁ గొంచెమె యుండు నటంద్రు మాధవా! 51

చ. కనియును భర్తలొద్ద నొక కాసును గవ్వయు లేదటంచు నం
గనలు వివేక శూన్యులయి కాసులు కంటెలు దెమ్మటంచు వా
రిని గడు కష్టపెట్టుదురు రేపులు మాపులు గూడ వార ల
ట్లనుటకు హేతువేమనుచు నారయ మూఢతగాదె మాధవా! 52

ఉ. బంగరు రాసులెన్ని గృహమధ్యమునం గల కార్యమేమి వా
నిం గరగించి సొమ్ములుగ నేర్పున జేసి యొడళ్ళ బెట్టిన
ట్టంగన లెల్లరుం సహజమౌ తెలివిం దగ బొంది యుండగా
రంగుగ విద్య నేర్చిననె రాజిలుగా తెలివెందు మాధవా! 53

ఉ. పంతులువారు శాస్త్రులగు వారలతో మనయాఁడువారి కొ
క్కింత పురాణము ల్దెలియ దెట్టుల నైనను జెప్పుమన్న వా
రెంతగ జెప్పియుండిన నొకింతయు బోధయ గాదు వారికిన్
ఇంతకు సొమ్ముపోక యొకటే పయి పెచ్చగుచుండు మాధవా! 54

ఉ. పేరయ బొట్లుగారి నతివేగముగా బిలిపించి తాము పే
రూరికిఁబోవ మంచిదిన మొప్పుగ వర్జము లేక యుండ మీ
రారసి చెప్పుడం చతివ లందరు కోరు టదేలచూడుఁ డీ
వారికి దానినిం దెలియ వచ్చిన తప్పిదమేమొ మాధవా! 55

ఉ. పట్టిన సోమయాజికిని బన్నుగ జొచ్చితి శాస్త్రి యింట నే
నట్టులు నుండగా లవణమైన నెఱుంగనె యంచుదొడ్డిలో
గుట్టగ నున్న గోమయము కొంచెము విస్తరి వైచినందురే
యట్టుల నున్నదీ మగువ లందరి జ్ఞానము జూడ మాధవా! 56

ఉ. కోరి విశేష శాస్త్రముల గోమలి నేర్చిన నేరకున్న నిం
పారగ జిత్రలేఖనము బాలచికిత్స చరిత్ర భూసమా
చారము దేశభాష గడుచక్కన నర్థము జేయ వ్రాయఁగా
సారెకు లెక్కలం దెలియ జాలును చేడియ లెల్ల మాధవా! 57

చ. పొలతులువిద్యనేర్చి చెడిపోవుదురందు రదుత్తమాట యిం
పలరగ మంచినీతులను భక్తిని దైవమునందు నుంపగా
పొలుపుగ దెల్పువిద్య చెడుబుద్ధులు నేర్చుకొనుండటంచు దాఁ
దెలుపదు గాన చేడియలు తిన్నగ నేర్తురు గాక! మాధవా! 58

చ. మరియును గొందరందురిల మానిని విద్యల నందెనేని దా
గరిమ వహించి పెన్మిటిని గౌరవ మందగ జేయ దెన్నడం
చురువడి కల్లమాట పతి నొప్పుగ మన్ననజేయ విద్య దా
గఱపును గాన చేడియలు క్రన్నన నేర్తుఱు గాక మాధవా! 59

చ. ముదితల కెల్ల యోగ్యతలు మున్మును గష్టముచేసి యీభువిన్
చదువుటవల్ల రావు సహజంబులు గానె లభించు నందు ర
య్యది నిజమైన శాస్త్రముల నన్నియు నేల నిరర్ధకంబులే
మదిగన నట్టులైన మగవారలకుం జదువేల మాధవా! 60

ఉ. కోమలు లెప్పుడుం చదువఁ గోరుచు నుండిన నింటి చైవులం
బ్రామిక జేయు టెట్లు మగ వారల నెత్తిన బెట్టునందురే
నేమము తోడ విద్యలను నేర్చుచునే వ్యవహారముల్ భువిన్
వేమరు జేసినట్లు నలివేణులు జేయుదురయ్య! మాధవా! 61

ఉ. బాలల తోడ గూడుకొని వామన గుంటలు గవ్వలాట జ
ల్లీలును గచ్చకాయలును నెన్నియొ యాటల తోడ నెంతయున్
గాలము వ్యర్థ పుచ్చుదురు కావున బాల్యము నందు స్త్రీలకున్
చాలుగ విద్య నేర్చుటకు చాలును కాలము జూడు మాధవా! 62

చ. అలరఁగ గోమలుల్ కుశలవాఖ్య చరిత్రను పేరుమార్చి కు
చ్చెలకథ యంచు జెప్పుదురు చిక్కగ చేడియ లిట్టు లున్నచో
బలుమరు జెప్పనేల యిక పాటలతప్పు లవెన్నియుండునో
తెలిసి కొనంగ వచ్చు మరి దీనికి గారణమేమి? మాధవా! 63

చ. వనితలు కాళ్ళు చాఁపుకొని వారల వీరల గుంపుజేర్చి యం
దొనరగ గృష్ణు చద్దులను నూర్మిళ నిద్రల వామనాలనుం
బనివడి తప్పుపాటలను బాడుచు నుండుట కంటె శ్రద్ధ నం
గనలును విద్యనట్టితరి గ్రన్నన నేరగ వచ్చు మాధవా! 64

మ. భళిరే! యెట్టిది వింజమూరికుల తిమ్మాభిఖ్యనుంజూడ నా
లలనా రత్నము రామణీయకము డోలాయాత్ర యన్గ్రంథమీ
వలనే జేసెన టందురే ద్విపదలో బాండిత్య మింపార నీ
చెలులుం దద్గతి విద్య నేరగ భువిం జేయంగదే! మాధవా! 65

ఉ. కోరిక మూగనోము, దయకుంకుమ మీమొదలైన నోములన్
గూరిమి నోచుచుంద్రు కద కోమలు లందరు గూడి ప్రొద్దు ని
ట్లూరక బుచ్చుకంటె తమ రొప్పుగ విద్యల నిట్టి తీరికన్
నేరఁగవచ్చు గాదె కడు నేరుపు మీరఁగ వేగ మాధవా! 66

ఉ. వెళ్లుదు రత్తలిండ్లకును బిల్లల గందు రికెట్టులందురే
గల్లలు సుమ్మి పిల్లలను గన్నపు డూరక యుండవచ్చు న
త్తిళ్లకు బోయినం బెనిమి టేనియు బెద్దల యొద్ద నేనియున్
సల్లలితంబుగా జదువు చాలగ నేరఁగవచ్చు మాధవా! 67

మ. తలద్రువ్వంగను నొక్క గంట, మరి పెట్టన్‌సొమ్ములం గంట, చీ
రెల గట్టంగను బొట్టుబెట్టనగు నీ రెండుం దగన్ గంట యీ
యిలలో నెందరు స్త్రీలు తీరుబడిగా నీలీలగావింతు రిం
దులలో గొంచెముసేపు విద్యకొరకుం జూపట్టదే మాధవా! 68

చ. నగలను జూచుకొంచు నివి నాగరికంబుగ లేవటంచు నా
నగలను మార్చుకొంచు నిల నాతు లదేపని గొందురెప్పుడున్
బగలును గొంత రా సమయమందున గొంతను విద్యయందు నుం
చగ నికనైన జేయగదె చానలు శ్రద్ధ వహించి మాధవా! 69

చ. మును దమ పెద్దలున్ జెవుల ముక్కుల గుట్టిన కుట్లు చాలకిం
కను తమ యంత సూదులను, గట్టిగ ముండ్లను బెట్టి కుట్టు కొం
చనుదిన మెందరో కఠిన మైనను చూడరు కాంతలిట్టి శ్ర
ద్ధను చదువంగ నుంచినను ధన్యలెయౌదురు గాదె మాధవా! 70

మ. ఉపయోగంబును లేదు జూడ మరి వీరూళ్ళేలనా యేరికే
నుపకారంబును జేయనా దగునటం చుద్యోగముల్ జేయనా
చపలాక్షుల్ భువివిద్యనేర్చి యనుచున్ చాటింతురే గొందఱ
ట్లెపుడుంగాదిల జ్ఞానమెచ్చగుటయే యీయన్నియున్ మాధవా! 71

చ. చదివిన దుర్గుణంబులను జాలగ బొందుదు రంద్రు గాని య
య్యది చెడుబుద్ధులన్ గరపు నట్లయినన్ మగవారు నేర్వ చె
ల్లదుగద విద్యనెట్లు మది రంగుగ నేరుచు చున్నవార లి
య్యదనున నందరున్ జెడుగు నందిరి జూడగదయ్య మాధవా! 72

చ. మునుపటి చేడెలెల్లరును మోదము తోడుత విద్య నేర్చిరం
చును మరి వార లెంతొ పరిశుద్ధలు ప్రాప్త వివేకలంచు లో
వినెదమె యట్టులేనిపుడు విద్యల నేర్చిన స్త్రీల మాత్రమే
చెనటులు జ్ఞానశూన్యులుగ జెప్పఁగ నొప్పుట యెట్లు మాధవా! 73

ఉ. పెక్కుగ నుండిరే గుడిసెవేటులు ధారుణిజూడ వారిలో
నొక్కరు గాని విద్య గన నొప్పుగ నేర్చిన వారి గానమిం
కొక్క విశేషమున్ జదువు కొన్నను వారలు నెప్డు జేయ బో
రిక్కుటిలంపు చేష్టలిటు లెక్కడ నైనను జూడు మాధవా! 74

ఉ. తీరుగ నాఁడువాండ్రు మనదేశములన్ జదివించ కుంటచే
నారయ వారలింత మరియాదను దెచ్చుచు నుండి రంద్రు కా
దే రహి గల్గెనన్న పరదేశములం గల వారి కన్న నా
చారము లన్నియున్ మనవి జక్కగ నుండుట వల్ల మాధవా! 75

ఉ. ఈ సఖులెల్ల విద్యరుచి నింపుగ జూచిన దానియందు జి
జ్ఞాస వహించి యెప్పుడును గాంచిన సొమ్ము లలంకరించుటం
దాసను నిద్రనున్ బగలు నాటలు నింక నవెన్ని యెన్నియో
దోసపు చేష్టలం దొలగ దోయుదురయ్య గనంగ మాధవా! 76

ఉ. వెలఁదుల కేడనేని గన విద్యలనం దెదిపాటి జ్ఞానమిం
దుల గలదంద్రు కొందరికి తొల్లిటి పెద్దలు ముద్దరాండ్రకిం
పలరగ నాల్గురెట్లు మగవారల కన్నను బుద్ధి యెక్కుడం
చిల దెలుపంగ వీరలిపు డిట్టుల జెప్పఁగనేల మాధవా! 77

చ. పరువుగ నుండలేక ఇటు భామిను లెల్లను విద్యనేర్చి దా
మొరులకు కీర్తులన్ దెలుపు చుండుట యేమి విచిత్రమంద్రు కొం
దరదటులైన నెవ్వతయినన్ గడువిద్యలనేర్చి కీర్తి దా
నురవడి గాంచెనన్న తగదో యది మంచిదొ చూడు మాధవా! 78

చ. తరుణులు విద్య నేర్చిన స్వతంత్రము లిమ్మనుచుంద్రటంచు నం
దురె యదికల్ల దాము దగునో యెవి పూనగ నెవ్వి గూడదో
యెరిగియె పొందు చుంద్రు గద యెప్పుడు గూడను బాగ విద్యలన్
గరచినవారు గాన నిది న్యాయమె జెప్పఁగ చూడ మాధవా! 79

ఉ. ఇట్టుల విద్యనేర్పుట యిదెందులకో మగవారివద్ద నీ
బొట్టెల కంచు జెప్పుదురు బొందుగ కొందరి దేమివింత వీ
రట్టులనైన నోములని రంగుగ బూజల జెప్పుమంచు నే
గుట్టును లేక శాస్త్రికడ కొంచక యుందుర దెట్లు మాధవా! 80

చ. తమతమ యాడు బిడ్డలకు ద్రౌపది మున్నగు పేళ్ళు బెట్టినన్
తమకము చేత కొందరవి తప్పక గాంచి యివేటిపేళ్ళు బో
గముఁ కులమందు నొప్పునవికా యని జెప్పుదు రట్టులైన నిం
పమరఁగ కృష్ణపేరు మగవారికి బెట్టుదురేల మాధవా! 81

ఉ. ఎంతయు వానయేని మరియెండయ యేనియు బాధపెట్టినన్
కాంతలు ఛత్రమేల నొదగన్ గొనిపోవగ రాదు వారలే
చెంతకుగాని బోవలయు చెయ్యులు గల్గిన చేటవానకున్
వింతగ కొంగు లెండకును వేయుచు నుండిరి గానిమాధవా! 82

ఉ. ఏలనొ యిప్పుడీ భువిని యింతుల నెంతయు జాలిలేక ఘో
షాలను బెట్టుచుండి రిటు చక్కఁగ పల్లకు లందు గాని గా
డీలను బోవ వాకిళుల దీటుగ మూసియు జాల కింక బు
ర్ఖాలను వేయుచుందు రుసురాడుట కష్టముగాగ మాధవా! 83

ఉ. ఎక్కడి నుండి దెత్తు మిల నింతులు గూడను విద్య నేరగా
రొక్క మటందు రట్లయిన రూడిగ లోఁగిట నాఁడువారలే
యెక్కుడు నేర్చినన్ జదువు నెంతయు వారల యాఁడుబిడ్డలన్
మక్కువ విద్య నేర్చునటు మానక జేయగ వచ్చు మాధవా! 84

ఉ. ఇంతకు నిన్ని యిక్కటుల నింతులబొందఁగ జేయుచుండ గో
రంతయు లేనెలేదు గన లాభము నష్టము లుండు గాని వా
రెంతయు నీడ నుండి యెపుడెండనుగానక యుంట వల్ల మే
నంతయు పాలి జాడ్యముల కాస్పద మౌదురు గాదె మాధవా! 85

చ. వరుసను మున్ను స్త్రీలఁ దగుప్రాయము వచ్చినపిమ్మటం స్వయం
వరములఁ జాట బంపి తమ వాంఛకు వచ్చిన వారి బెండ్లి గా
బరపిరటంచు విందు మన బాలల బెండ్లి యనంగ నేమొ వా
రెరుఁగక యుండఁ బెండ్లి దమరింపుగ జేయుదు రేల మాధవా! 86

ఉ. ఇట్టుల నెన్ని కష్టముల నింతులఁ బెట్టుదు రొక్కమాసచే
పట్టుల డెబ్బదెన్మిదియు వర్షములంగల వారిచేతనే
బొట్టులఁ గట్టనిచ్చి తమ ముద్దుల కూఁతుల జాలిలేక ని
క్కట్టులఁ గొన్ని నాళులనె క్రన్నన జేర్తురు గాదె మాధవా! 87

చ. తనరఁగ సీత, చంద్రమతి, ద్రౌపదియున్, దమయంతి, వీరుకా
ననముల బందెలేక తమ నాథుల వెంబడి బోయిరంచు నిం
కను గన ముందు భర్తలకు కైకయి సత్య సహాయ లైరి నే
ర్పున సమరంబు లందున నెఱుఁగమె బందె యికేల మాధవా! 88

చ. గరితల దుస్థితిన్ దొలఁగగా నిలఁజేయఁగ పొలుమాలి నీ
వరయఁగ లేదనన్ భువన మంతయు కుక్షినె యుంతె నేలనో
మరచితి వంచు నెంచ నిసుమంతయు లేదని యంద్రు నీకప
స్మరణము దొడ్డవాఁడవని మాన్యులు చెప్పుచు నుంద్రు మాధవా! 89

చ. నీ వొనరించు కర్జముల నీకిది యెంతటి కష్టకార్యమా
భావము నందు జూడగను భావజ సన్నిభ సుందరాంగ! నీ
వే వగనైన నాదు మొర వీనుల బెట్టగ గోరుదాననే
గావున నామనోరధము గట్టిగ దీర్పగదయ్య! మాధవా! 90

## : దశావతారస్తుతి :

ఉ. సోమకుఁడెల్ల వేదముల చోరత నెత్తుకపోవ వానితో
వేమరు బోరి చంపి మరి వేదము లెల్లను దెచ్చి బ్రహ్మకున్
నేమముతో నొసంగితివి నీరజనాభ! సువర్ణచేల! యీ
పామరురాలిఁబ్రోవ మదిభారమె యో ఝషరూప! మాధవా! 91

చ. చెలువుగ నా సురాసురులు జేరి ముదమ్మున పాలసంద్రమున్
జిలికెడివేళ నీవెగద జెన్నుగ మూపున మోసి మందరా
చలమును వారి కార్యమును జక్కగజేసితి నన్నుబ్రోవ నీ
చలమది యేలనయ్య! జలసంచర కచ్ఛపరూప! మాధవా! 92

మ. కడు నీతోడ విరోధమున్ దలఁచి లోకంబెల్ల బాధించుచున్
పుడమిం తద్దయు జాపచుట్టను వలెన్ జుట్టంగ నీవంతటన్
వడిగా కంఠము ద్రుంచివైచితి హిరణ్యాక్షున్ గృపన్ భూమి పె
ల్లడలున్ బాపితిగాదె వేగమె వరాహాకారకా! మాధవా! 93

చ. బలిమి హిరణ్య కశ్యపునిబట్టి యొడల్ బెకిలించిపేగులన్
గళమున మాలికావళిగఁ గట్టి తదాత్మజు నీదు భక్తు నిం
పలరగ బ్రోచినావట రమాపతి! దీర్చవె నాదుకోర్కెలన్
జలరుహనేత్ర! భూరమణ! జాలములేక నృసింహమాధవా! 94

చ. అలరఁగ మున్నుదేవతల నందటి నెంతయొ జాలిమాలి బా
ధల నొనరింప భూమి మరి దానము నిమ్మని మూడుపాదముల్
నలినదళాక్ష! యాకస మిలాతలముం దగ నాక్రమించియున్
బలిని రసాతలమ్మునకుఁ బంపిన వామనరూప! మాధవా! 95

ఉ. అందముగాను క్షత్రియులయందు విరోధము బూనియుండి వా
రెందును లేవకుండునటు లెన్నియొ సారులు రూపుమాప యం
దందుల శ్రద్ధతో నెమకి యౌర! వధించితిగా దయాకరా!
పొందుగ గండ్రగొడ్డలిని బూనిన భార్గవరామ! మాధవా! 96

చ. పసితనమందె యేగి పితృవాక్యము దాటక కానిచోట్లకున్
కసరుచుదెచ్చితౌర! నిజకాంతను రావణుతోడ బోరి యిం
పెసఁగఁగ వానిలంకకు విభీషణు రాజుగ జేసి వెళ్ళి సం
తసముగ రాజ్యమేలితివి ధైర్యనిధీ! రఘురామ! మాధవా! 97

చ. యదుకులమందు బుట్టితివి యల్లన రేవతి బెండ్లియాడియున్
పదపడి కృష్ణుతోఁ గలసి పట్టి వధించితిగా ప్రలంబుసున్
మొదలగు రాక్షసేంద్రులను బోరున శూరత నీవు నాగలిం
ముదమున బూనితే యఘవిమోచన! యోబలరామ! మాధవా! 98

చ. ఇలఁ గడు శూరులైన యసురేంద్రులు యాగము జేసి క్రొవ్వనన్
మెలఁగుచు నుండ నీవపుడు మెల్లన నచ్చటి కేగి వారితోఁ
దెలియఁగ ప్రాణహింస దగ దెప్పుడు నంచును నీతు లెన్నియో
వలుకుచు వారి యాగముల భంగము జేసిన బుద్ధ! మాధవా! 99

ఉ. ఒప్పుగ నీయుగాంతమున నోర్తువు గుఱ్ఱముపైన నెక్కి యా
తప్పులజేయు మ్లేచ్ఛులను దండన జేయఁగ నంచు విందు మే
యొప్పులకుప్ప యంతయును యోజన సేయఁగ పాడిగాదు నీ
విప్పసికూన బ్రోచుటకు నిట్టుల నూరక కల్కి! మాధవా! 100

ఉ. భాసురమైన నీవెదద వక్షము నందున శ్రీ వెలుఁగగా
దాసుల కేకొఱంత సతతమ్మును సంతస మూరి శోభితా
వాసులు గారె విశ్వపరిపాలన! సుందర రామ! శారదా
భ్రాసమకీర్తిపూరిత దిగంతర వైభవచంద్ర! మాధవా! 101

★ ★ ★

# శ్రీమతి వేమూరి శారదాంబ గారు రచించిన

# కీర్తనలు

## శ్రీశారదాంబాయైనమః

### జిలకమాస్ రాగం

గౌరీపురారి సుందరి, మురారిసోదరీ
సారసలోచన నాదు, కోరికలీగదే ॥ గౌరీ ॥

నేరా మేమీ జేసీతినే, నిన్నేనమ్మీతినే
సారేకునీ, పాదములను, చేరీ భజింతునే ॥ గౌరీ ॥ 1

నిన్ను వినా, దైవమునే, నెన్నడువేడనే,
కన్నతల్లి జ్ఞానమొసగి, కావవేశంకరీ ॥ గౌరీ ॥ 2

సారహీనమౌ, సంసారజలధి జిక్కీతినే,
శారదాపూజీతవని, శరణుజొచ్చితినే ॥ గౌరీ ॥ 3

### తోడి రాగం

పాపమోచనీ,నీ, ప్రాపుజేరితీ, కోపమేల నా
దువెతల, బాపి బ్రోవవే ॥
నమ్మవేమదే,మాయమ్మశంకరీ, నెమ్మనమున
నీపదములు, నిల్పియుంటినే, ॥ ఓ ॥ ॥ పాప ॥ 1

భూధరాత్మజా, సం, పూజ్యమానసా,
శ్రీధరాది వందితా నాచింతదీర్పవే ॥ ఓ ॥ ॥ పాప ॥ 2

తల్లినీవెగా, నా,తండ్రి నీవనీ, యుల్లమందు
నమ్మివేడు చున్నదాననే ॥ ఓ ॥ ॥ పాప ॥ 3

శారదానుతా, వే, సారివేడితీ,
సారసాక్షి నన్నుబ్రోవ, జాలమేలనే ॥ ఓ ॥ ॥ పాప ॥ 4

★ ★ ★



## శకటబంధగర్భితోత్పలమాల

ఉ. భాసురమైన నీ వెడద వక్షమునందున శ్రీవె లుగcగా
దాసుల కేకొఅంత సతతమ్మును సంతస మూరి శోభితా
వాసులుగారె విశ్వపరిపాలనసుందర రామ శారదా
భ్రాసమకీర్తిపూరిత దిగంతరవైభవ చంద్ర మాధవా.

---

★ బండి జల్లలోని 4వ అడ్డువరుస అక్షరాలను కలిపి చదివితే శారదాంబగారి భర్త పేరు 'శ్రీవెమూరి రామచంద్ర' అని వస్తుంది.



చ. అరమరలేక నిచ్చలు బృహన్నల యొద్దను నాట్యశాస్త్రమున్
విరటుని కూఁతు దాఁ గరచి విస్తృతకీర్తి వహింపలేదె యు
త్తర కడు యోగ్యురాలని సదా పొగడం బడలేదె చూడ నా
పరమపతివ్రతామణి శుభాంగు బరీక్షితుఁ గాంచె మాధవా! ప. 32



మ. రచియించెన్గద భక్తి యుక్తముగ మీరాబాయి శ్రీకృష్ణుపై
రచనల్ బెక్కులు కీర్తనల్ భువి మహారాజేంద్రు నిల్లాలునై
యచలంబైన మనంబుతోడుతను వింధ్యాద్ర్యుత్తరప్రాంత భూ
మి చనన్ బేర్కొను చుందు రిప్పటికి నామీరాంబికన్ మాధవా! ప. 43



చ. చతురత వ్రాసె జిత్రపటజాలములన్ మును జిత్రరేఖ యం
చితముగ నెట్టి విద్యగఱచెన్ గన నట్టులు నేర్పు మీఱ వ్రా
యు తరుణు లున్నచో నదియు నుత్తమ పద్ధతి కాన భూమియం
దతివలు నట్లు నేర నిఁకనైనను జేయఁగదయ్య! మాధవా! ప. 48



చ. వనితలు కాళ్ళు చాఁపుకొని వారల వీరల గుంపుజేర్చి యం
దొనరగ గృష్ణు చద్దులను నూర్మిళ నిద్రల వామనాలనుం
బనివడి తప్పుపాటలను బాడుచు నుండుట కంటె శ్రద్ధ నం
గనలును విద్యనట్టితరి గ్రన్నన నేరగ వచ్చు మాధవా! ప. 64



మ. తలద్రువ్వంగను నొక్క గంట, మరి పెట్టన్‌సొమ్ములం గంట, చీ
రెల గట్టంగను బొట్టుబెట్టనగు నీ రెండుం దగన్ గంట యీ
యిలలో నెందరు స్త్రీలు తీరుబడిగా నీలీలగావింతు రిం
దులలో గొంచెముసేపు విద్యకొరకుం జూపట్టదే మాధవా! ప. 68

# పరిష్కర్త పరిచయం



| | | | |
|---|---|---|---|
| 1. | పేరు | : | **ఉన్నం జ్యోతివాసు** |
| 2. | తల్లిదండ్రులు | : | వీరమ్మ, కోటయ్యలు |
| 3. | జననము | : | 3.1.1971 |
| 4. | అభిజనము | : | వేములపాడు, ప్రకాశం జిల్లా |
| 5. | విద్య | : | B.Sc. B.Ed |
| 6. | బిరుదము | : | ప్రసన్నకవి (విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులచే 31.1.2015న తిరుపతిలో అనుగ్రహింపబడినది |

## రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | ఎఱ్ఱ చెప్పులు | స్వీయపద్య కావ్యము | 2003 |
| 2. | శబ్దశిల్పి దీపాలవారి భారతీవరివస్య | విమర్శ గ్రంథము | 2008 |
| 3. | సారంగధర చరిత్రము (జితకాశి వ్యాఖ్య) | సంపాదకత్వము | 2009 |
| 4. | బహుళాశ్వ చరిత్రము<br>దామెర్ల వేంగళభూపాలుడు | పరిష్కరణ<br>(విపుల పీఠికతో) | 2009 |
| 5. | శివలీలా విలాసము<br>(కూచిమంచి తిమ్మన) | పరిష్కరణ<br>(విపుల పీఠికతో) | 2010 |
| 6. | ఆరాధన | స్వీయ పద్యకావ్యము | 2010 |
| 7. | దీపాలవారి కావ్యావళి | సంపాదకత్వము | 2011 |
| 8. | విష్ణుమాయా విలాసము<br>(కంకంటి నరసింహరాజు) | పరిష్కరణ<br>(విపుల పీఠికతో) | 2011 |
| 9. | ఆరామము | స్వీయవ్యాస సంపుటి | 2012 |
| 10. | సుభద్రాపరిణయము<br>(కూచిమంచి జగ్గకవి) | పరిష్కరణ<br>(విపుల పీఠికతో) | 2013 |
| 11. | విష్ణుపదశావతారస్తవము<br>(దీపాల వారి వ్యాఖ్య) | సంపాదకత్వము | 2014 |
| 12. | వల్లవీ పల్లవోల్లాసము<br>(మాడభూషి నరసింహాచార్యులు) | పరిష్కరణ<br>(విపుల పీఠికతో) | 2015 |
| 13. | మృత్యుంజయ శతకము<br>(మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి) | పరిష్కరణ<br>(విపులపీఠికతో) | 2016 |
| 14. | సస్యానందము (దోనయామాత్యుడు) | పరిష్కరణ (విపుల పీఠికతో) | 2016 |



శ్రీ

కలావతి

SREE

# KALAVATI.

A MONTHLY TELUGU JOURNAL.

EDITED BY

SREEPADA KRISTNAMOORTY SASTRY.

Vol. III. { RAJAHMUNDRY, MAY 1901. } No.5

CONTENTS.

1. Ourselves
2. Reviews
3. News and Notes
4. Ghatikachalamahatyam by Tenala Ramakrishnakavi
5. Anandarangaratchandam by Kasturi Rangakavi
6. Prabodhachandrodayanatakam by A. Vyasamoorty Sastry Garu
7. LakshminarasimhaChandralokam by T.LakshminarasimhamGar
8. Physics by Kandula Sreemannarayanamoorty Garu
9. Dhurjanabarjanam by Sari Purnanandam Garu
10 Kaliyamardanam by Vaddadi Subbarayudu garu
11 Madhavasethakamu by Vemuri Saradamba Garu
12 Extracts

RAJAHMUNDRY.

PRINTED AT THE KALAVATI PRESS.

1901.

శ్రీమతి వేమూరి శారదాంబ గారి మాధవశతకము ప్రచురించబడిన 1901 సం. కలావతి పత్రికలోని విషయసూచిక పుటలు

పత్త్రికాధిపతి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.

విషయసూచిక.

—0—

౧ స్వవిషయము.

౨ కృతివిమర్శనము

౩ వృత్తాంతములు

౪ ఘటికాచలమాహాత్మ్యము. తెన్నాలి రామకృష్ణకవి.

౫ అనందరంగరాట్ఛందము. కస్తూరి రంగకవి.

౬ శ్రీలోకచంద్రోదయము. ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు.

౭ లక్ష్మీస్వయంవరము. [illegible] లక్ష్మీనరసింహముగారు

౮ [illegible] శ్రీమన్నారాయణమూర్తిగారు

౯ దుర్గవర్ణనము. సూరిపూర్ణానందముగారు

౧౦ కాశీవర్ణనము. వడ్డాది సుబ్బారాయుడుగారు

౧౧ మాధవశతకము. వేమూరి శారదాంబ

౧౨ ఇతరపత్త్రికలలోని విశేషములు

ఈపత్త్రికకు చందానిర్ణయము. ([illegible])

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రధానపోషకులకు (సంవత్సరమునకు) | ... | ... | ... | ... | రు 24-0-0 |
| పోషకులకు | ... | ... | ... | ... | రు 12-0-0 |
| [illegible] | ... | ... | ... | ... | రు 6-0-0 |
| చందాదారులకు (ముందుగా చెల్లించిన) | | | ... | ... | రు 2-8-0 |
| విద్యార్థులకును పల్లెటూరి ఉపాధ్యాయులకును... | | | | ... | రు 2-0-0 |
| స్త్రీలకు | ... | ... | ... | ... | రు 1-8-0 |
| విడిపత్త్రిక యొకటికి | | ... | ... | ... | రు 0-4-0 |

మరియును ఆరుమాసములకు, ఏర్పడిన చందాకంటె అందులకు 0—4—0లు చొప్పున అధికమియ్యవలెను. అంతకు తక్కువ చందా అంగీకరింపబడవు. చందా సంవత్సరము ప్రారంభమైన మాసములోపల పంపవలయును. [illegible] ఉత్తరప్రత్యుత్తరములు చేయదలచువారు కలావతి కార్యస్థానాధిపతిగారికి, రాజమహేంద్రవరము. అని వ్రాసికొనవలయును.

శ్రీమతి వేమూరి శారదాంబ గారి మాధవశతకము ప్రచురించబడిన 1901 సం. కలావతి పత్రికలోని విషయసూచిక పుటలు

# శ్రీ దాసు శ్రీరాములుగారి వంశవృక్షము

**రఘునాధరావు**
1560 ప్రాంతములో ధార్వాడు నుండి గోల్కొండకు రణోద్యోగిగ వచ్చెనట
↓
**గంగోజీ (హరిదాస్)**
1620-30 ప్రాంతంలో హైదరాబాదులో నుండెను. హరిదాసు డగుటచే ఈ వంశము వారికి **'దాసు'** వారుగా ఇంటిపేరు వచ్చినది.
↓
**రఘునాయకులు**
1640-1650 ప్రాంతంలో బందరుకు బుడతకీచులతో (పోర్చుగీసు వారితో) లౌక్య వ్యవహారములపై వచ్చెనట
↓
**గంగరాజు (కన్నయ్య)**
1670 ప్రాంతంలో నూజివీడుకి దండపతి పదివిని వచ్చినారు

| ↓ | ↓ | ↓ |
|---|---|---|
| **జానకిరామయ్య** | **సుందరరామయ్య** | **వెంకటరామయ్య** |

↓ (సుందరరామయ్య)
**గంగరాజు**
బందరులో ఈస్టు ఇండియా కంపెనీవారు రాజ్యస్థాపన చేసినపుడు
1750-60 ప్రాంతంలో వీరు ప్రముఖులుగా ఉండిరి

| ↓ | ↓ | ↓ |
|---|---|---|
| **అక్కిరాజు**<br>అల్లూరులో సోమేశ్వర లింగమును ప్రతిష్ఠించినాడు క్రీ.శ. 1760<br>↓<br>**జోగిరాజు**<br>(మోహ పుత్రుడు) | **రఘునాయకులు (కన్నయ్య)**<br>క్రీ.శ.1760-92 ప్రాంతంలో గురజ కమదన వారి దివాను<br>↓<br>**గంగరాజు**<br>దత్తపుత్రుడు. 1851లో మృతి<br>↓<br>**కుటుంబరాయుడు**<br>1875లో మృతి | **బ్రహ్మయ్య**<br>↓<br>**కృష్ణయ్య**<br>(1782-1822) |

↓ (కృష్ణయ్య)

| ↓ | ↓ | ↓ |
|---|---|---|
| **బ్రహ్మయ్య**<br>1830లో మృతి | **కన్నయ్య**<br>1816-1889 | **లక్ష్మయ్య**<br>(అవివాహితులు) |

**దాసు శ్రీరాములు**
(1846 - 1908)
↓

| **కేశవరావు** | **నారాయణరావు** | **మాధవరావు** | **గోవిందరావు** | **విష్ణురావు** | **మధుసూదనరావు** | **శారదాంబ** |
|---|---|---|---|---|---|---|
| 1867 -1934 | 1869-1905 | 1871-1934 | 1874-1944 | 1876-1939 | 1878-1948 | 1881-1899 |

మహాకవి దాసు శ్రీరాములు గారి వంశము వృద్ధి చెంది, వారి వంశీకులు గొప్ప విద్యాధికులై, రచయితలుగా, శాస్త్రజ్ఞులుగా, న్యాయవాదులుగా పత్రికా, విద్యా, వైద్య రంగ ప్రముఖులుగా, కళాకారులుగా, సంఘ సేవకులుగా, దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలలో వెలుగొందుతున్నారు.

**(కీ॥శే॥ దాసు విష్ణురావు గారు వ్రాసిన 'దాసువారి వంశచరిత్ర' 1939 ఆధారంగా)**

# మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి

# ప్రచురణలు

## మహాకవి దాసు శ్రీరాములు గారి రచనలు

1. తెలుగునాడు
2. అభినవగద్య ప్రబంధము
3. శ్రీదేవీభాగవతము
4. సూర్యశతకము
5. కురంగ గౌరీ శంకర నాటిక
6. చక్కట్లదండ
7. భృంగరాజమహిమ, శ్రాద్ధ సంశయవిచ్ఛేది
8. దురాచారపిశాచ భంజని, ఆచారనిరుక్తి, విగ్రహారాధన తారావళి
9. పదములు – జావళీలు
10. కృతులు పదములు – జావళీలు
11. అభిజ్ఞానశాకుంతలము (అచ్చతెనుఁగు)

## ఇతర ప్రచురణలు

1. మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక (1975)
2. "మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు – ఒక సమీక్ష" (శ్రీమతి వెలగపూడి వైదేహి గారి పి.హెచ్‌డి. సిద్ధాంత వ్యాసము) ప్రథమ ముద్రణ (1986), ద్వితీయ ముద్రణ (2014)

## శ్రీమతి వేమూరి(దాసు)శారదాంబ గారి రచనలు

1. మాధవశతకము (2019)
2. నాగ్నజితీపరిణయము (2019)

# గమనిక

# గమనిక

# గమనిక



దాసు శ్రీరాములు గారు జన్మించిన ఇల్లు,

కూరాడ, గుడ్లవల్లేరు మండలం, కృష్ణా జిల్లా

## దాసు శ్రీరాములు గారు నివసించిన ఇల్లు



దాసు శ్రీరాములు గారు ఏలూరులో ఈ ఇంట్లో 1883 నుండి 1908 వరకు 25 సంవత్సరాలు నివసించారు. ఈ ఇంటినుండే ఆయన మహాకవిగా, న్యాయవాదిగా, సంఘసంస్కర్తగా విఖ్యాతులయ్యారు. శారదాంబ గారు అపర శారదగా సంగీత, సాహిత్యాలను ఆపోసన పట్టింది ఈ ఇంట్లోనే. ప్రస్తుతము ఇందులో 'గాంధీ ఆంధ్రజాతీయ మహా విద్యాలయము' నడుపబడుచున్నది.

# VEMURI (DASU) SARADAMBA (1881-1899)



Vemuri Saradamba was born on May 3, 1881, at Alluru, near Machilipatnam in Andhra Pradesh, as the only daughter after six sons to renowned epicist Dasu Sreeramulu and Janakamma. As she was the only daughter and youngest of all, her parents and six brothers doted on her. Society at that time was steeped in prejudice against women. Girls could never get education. This denial extended to training women in fine arts like music and dance. High caste families considered such training a cardinal sin. It befitted only the lowly *nautch* girls and courtesans.

Sreeramulu (1846-1908) was widely known as a litterateur, lawyer, music composer, an educationist and a social reformer, who ardently believed that nothing barred women from learning music or studying literature. Sreeramulu held that it was necessary to create an atmosphere conducive to educating women and thus empower them to promote a better society. He himself led the renaissance. Recognizing Saradamba's keen interest in music and literature, he taught her Sanskrit and Telugu from an early age and encouraged her to learn music. He ignored social reproach and possible excommunication by the society. Saradamba soon picked up the nuances of music and in a short time became an expert Veena player and gave public concerts at places as far away as Mysore.

Saradamba married Vemuri Ramachandra Rao in 1888. In the social milieu typical of those times, lack of support for her literary and musical pursuits at her in-law's home failed to deter Saradamba from continuing literary activity. At the age of fourteen she began writing poetry. A woman with progressive ideas and faith in education's role in empowering women, she published essays critical of contemporary society's control over women. She condemned curbs on women socializing by confining them to house and denying them education. Many of those articles appeared in reputed journals like *Janana Patrika* and *Jnanodaya Patrika.* In *Madhava Satakam*, a book of hundred verses she depicts the pitiable state of unlettered women and seeks autonomy for them. At sixteen she produced a poetic treatise *'Nagnajiti Parinayam'*, a *prabandham*, a narrative describing the divine wedding of *Nagnajiti*, one of the eight consorts of *Lord Sri Krishna*. Scholars acclaimed her style of writing and hailed it as engaging as that of the great 15th century poetess Molla. She also composed songs in praise of various Goddesses in her Devi Stuti Keertanalu.

In '*Madhava Satakam*', a book of hundred verses, she depicts the then pitiable state of women who were unlettered and ignorant and sought autonomy for women. In this work she supplicates *Madhava* (Lord Krishna) to give good sense to the people to educate their womenfolk and the tagline of this book reads '*Strijanakshemarthaka Bhagavatprardhana'* (A Prayer for the Welfare of Womankind).

After a short but creative life, Saradamba in her 19th year merged into eternity on 26th December, 1899 at Eluru, leaving behind her husband, a daughter Durgamba and the just born son Parthasaradhi.